ప్రజాశక్తి

శుక్రవారం 9 ఫిబ్రవరి 2024

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

పార్టీల అధినేతలు ఢిల్లీ యాత్ర

- ఎన్నికల్లో పొత్తులతో లాభమెంత? నష్టమెంత?

- ప్రధాన పార్టీల్లో ఊహాగానాలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలైన తెలుగుదేశం, వైసిపి అధినేతలైన చంద్రబాబు, జగన్మోహన్‌రెడ్డి ఒకరి వెనుక మరొకరు హస్తినకు పోయి మోడీ, అమిత్ షాలను ప్రసన్నం చేసుకోవడంపై గల్లీ స్థాయిలో ఈ పార్టీల శ్రేణుల్లో ఒకింత ఆసక్తి, ఇంకొంత ఆందోళన ఎక్కువైంది. 2024 ఎన్నికల్లో పొత్తులు ఎవరికి ఏ మేరకు ప్రభావం చూపుతాయో అన్న చర్చ విశాఖలో అంతటా సాగుతోంది. 2014 నుంచి దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలో ఉంది. అనేక రాష్ట్రాల్లో బిజెపి మిత్రపక్షాలన్నీ ఆ పార్టీ నుంచి విడగొట్టుకుని వస్తున్న తరుణంలో ఏపి నుంచి అధినేతలిద్దరూ ఆ పార్టీతో జత కోసం క్యూ కట్టడం వల్ల రాష్ట్రానికి గానీ, ఆ పార్టీలకు గానీ ఏమైనా మేలు ఉందా? అన్న చర్చ విశాఖ అంతటా ఆయా పార్టీల్లో సాగుతోంది. ముఖ్యంగా పలు పార్లమెంట్ స్థానాల్లో తమ అభ్యర్థులను గెలిపించుకోడానికి కేంద్ర సహకారం కోసం వీరు వెంపర్లాడటం స్పష్టంగా కనిపిస్తోంది. విశాఖకు కేంద్రంలోని బిజెపి ప్రైవేటీకరణ విధానంతో చేస్తోన్న ద్రోహంపైనా వీరిలో చర్చ వినవస్తోంది.

నేతల్లో ఊహాగానాలు

రాష్ట్రంలో పలు ఎంపీ సీట్లు, విశాఖపట్నం పార్లమెంట్ స్థానానికి పోటీకోసం టిడిపి, బిజెపి రెండూ పరస్పరం సహకరించుకోడానికి చంద్రబాబు చొరవ చేశారంటూ ఆ పార్టీకి చెందిన కొంతమంది నేతల మధ్య గురువారం చర్చసాగింది. అదే సందర్భంలో బిజెపితో కలిస్తే ఏమిటి లాభం? అనే చర్చ కూడా వినిపిస్తోంది. ఏపికి ప్రత్యేక హోదాను బిజెపి ఇవ్వలేదు. రైల్వే జోన్ విషయంలోనూ తీవ్ర జాప్యం చేస్తోంది. అన్నిటికంటే ముఖ్యంగా వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించడానికి శతవిధాలా రెండేళ్ల నుంచీ విఫలయత్నాలు చేస్తూనే ఉంది. బిజెపితో ఏ పార్టీ ఎన్నికల పొత్తుల్లో ముందుకెళితే ఆ పార్టీకి ఈ విషయాలు కొరకరాని కొయ్యగా మారి ఫలితాలపైనా ప్రభావం చూపుతాయన్న ఆందోళన టిడిపి శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. జనసేన ఇప్పటికే బిజెపితో జతకట్టే ఉండడం ఏపిలో జగన్‌ను ఓడించేందుకు జనసేన కలిసి రావడంతో బిజెపిని కూడా కలుపుకుంటేనే మేలన్న రీతిలో చంద్రబాబు పథకం వేశారు. అయితే ముఖ్యంగా గాజువాక ప్రాంతంలోగల నేతల్లో ఈ అంశంపై ఇప్పటికే చర్చోపచర్చలు సాగుతున్నాయి. బిజెపితో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఏ విధంగా వచ్చే ఎన్నికల్లో ఎవరు కలిసినా ఆ పార్టీకి రాజకీయంగా నష్టం తప్పదన్నదే దీని సారాంశం. ప్రభుత్వ రంగ సంస్థలన్నిటినీ చాపచుట్టేసి కార్పొరేట్లకు కట్టబెట్టే బిజెపి విధానంపై విశాఖ కార్మికవర్గం, ప్రజలు తీవ్ర ఆవేదనతో ఉన్న సంగతి తెలిసిందే.

విశాఖ ఎంపీ స్థానంపై కదలికలు

విశాఖ పార్లమెంట్‌పై ఇప్పటికే బిజెపికి చెందిన జివిఎల్ నరసింహారావు విశాఖ కేంద్రంగా పలు కార్యక్రమాలు చేస్తూ అధిష్టానం ఆశీస్సుల కోసం ఎదురుచూస్తున్నారు. బిజెపి ఏపి అధ్యక్షులు దగ్గుబాటి పురంధరేశ్వరి తనకే విశాఖ టికెట్ దక్కుతుందంటూ అనుయాయుల వద్ద చెబుతున్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో తక్కువ ఓట్లతో వైసిపిపై ఓటమి చెందిన టిడిపి నాయకుడు, గీతం విద్యాసంస్థల అధ్యక్షుడు శ్రీభరత్ ఎంపీ స్థానానికి తప్ప ఎమ్మెల్యేగా వెళ్లే ప్రసక్తి లేదంటూ

మిగతా 2లో..

విశ్వాసానికి లభించిన గౌరవం

రాజ్యసభ అభ్యర్థిగా ఎమ్మెల్యే బాబూరావు



ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, నక్కపల్లి విలేకరి

ఆది నుంచి జగన్మోహన్‌రెడ్డి వెంట నడిచిన పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకు ఎట్టకేలకు సముచిత గౌరవం లభించింది. ఈ నెల 27న మూడు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అనకాపల్లి జిల్లా నుంచి ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకు రాజ్యసభ అభ్యర్థిగా వైసిపి ప్రకటించింది. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున మొట్టమొదట పాయకరావుపేట నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ఈయన రాజశేఖరరెడ్డి మరణానంతరం, 2011లో తన శాసనసభ్యత్వానికి రాజీనామాచేసి జగన్మోహన్‌రెడ్డితో వెళ్లారు. 2012లో జరిగిన ఉప ఎన్నికల్లో వైసిపి నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2014 ఎన్నికల్లో పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి సూచన మేరకు అమలాపురం ఎమ్మెల్యేగా పోటీచేసి ఓటమి పొందారు. 2019లో జరిగిన ఎన్నికల్లో పాయకరావుపేట ఎమ్మెల్యేగా రెండోసారి వైసిపి తరపున గెలిచారు. మొదటిసారి మంత్రివర్గంలో స్థానం లేకపోయినా రెండోసారి జరిగిన మంత్రివర్గ విస్తరణలో మంత్రి పదవి లభిస్తుందని ఆశపడ్డారు. మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. తన అసంతృప్తిని, బాధను బహిరంగంగా వ్యక్తం చేయడంతో జగన్మోహన్ రెడ్డితోవున్న సాన్నిహిత్యం కొద్దిగా దెబ్బతింది. ఈ సమయంలోనే నియోజక వర్గంలో బాబూరావుకు వ్యతిరేకంగా బలమైన గ్రూపు ఏర్పడింది. బాబూరావుపై బహిరంగ విమర్శలకు దిగింది. ఈ పరిణామాలు ఆయన్ను కొంతకాలం తీవ్రంగా కలచివేశాయి.

ఎక్కువ సమయం వెచ్చించి నియోజకవర్గంలోని పరిస్థితులను చక్కదిద్దుకునే ప్రయత్నం చేశారు. వచ్చే ఎన్నికల్లో బాబూరావును రాజ్యసభకు పంపించి, వేరొకరిని బరిలో పెడతామని పార్టీ నేతలు ఆయనకు చెప్పారు. ఆయన్ను రాజ్యసభ అభ్యర్థిగా ప్రకటించనప్పటికీ, పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్తగా రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులును నియమించింది. రాజ్యసభకు పంపిస్తారో, లేదో తెలియదుగానీ, ఎమ్మెల్యే టిక్కెట్ రాదని తేలిపోయింది. అయినా నిరాశ చెందకుండా పాయకరావుపేట వెళ్తూ పార్టీ కార్యక్రమాల్లో బాబూరావు భాగస్వాములయ్యారు. పార్టీ పట్ల విశ్వాసంతో ఉండడంతో మాట ప్రకారం బాబూరావుకు రాజ్యసభ అభ్యర్థిగా జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు.

ఆశా కార్యకర్తల నిర్బంధంపై నిరసన

▶ వార్త 7లో..

మెగా డిఎస్‌సి ప్రకటించాలి నిరుద్యోగుల అర్ధనగ్న ప్రదర్శన

▶ వార్త మెయిన్‌లో..

కెకె.లైన్‌లో పట్టాలు తప్పిన గూడ్సు

▶ వార్త మెయిన్‌లో..

విశాఖలో జెవివి సైన్స్ కళాయాత్ర

▶ వార్త మెయిన్‌లో..

రాష్ట్రాల హక్కులపై దాడి చేస్తున్న...

కేంద్రం నిరంకుశ చర్యలను ఖండించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

కేరళ ప్రభుత్వంపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ వివక్షకు వ్యతిరేకంగా, రాష్ట్రాల హక్కుల కోసం ఢిల్లీలో సాగుతున్న పోరాటానికి సంఘీభావంగా సిపిఎం ఆధ్వర్యాన అనకాపల్లి నెహ్రూ చౌక్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు మాట్లాడుతూ, కేరళ రాష్ట్రం పట్ల బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం వివక్షతపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. కేరళ రాష్ట్రానికి రావాల్సిన పన్నుల్లో వాటాను కుదించివేయడం, జిఎస్‌టి పరిహారం నిలిపివేయడం, రెవెన్యూలోటు భర్తీకి ఇవ్వాల్సిన గ్రాంట్లను తొక్కిపెట్టడం, రాష్ట్రాలు చేసే రుణాల పరిమితిని కుదించివేయడం వంటి చర్యల ద్వారా ఆర్థిక ఫెడరలిజంపై కేంద్రంలోని బిజెపి ఎడాపెడా దాడులు చేస్తోందన్నారు. ముఖ్యంగా బిజెపి యేతర పాలిత రాష్ట్రాలైన కేరళ, తమిళనాడు, కర్ణాటకను టార్గెట్‌గా పెట్టుకుని ఈ దాడులను తీవ్రతరం చేస్తోందన్నారు. ఆర్థిక ఫెడరలిజం సూత్రాలను బాహాటంగా ఉల్లంఘిస్తున్న కేంద్ర ప్రభుత్వ చర్యలపై ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ఇప్పటికే కోర్టును ఆశ్రయించిందని తెలిపారు. వివక్ష కారణంగా దక్షిణాది రాష్ట్రాల అర్థిక పరిస్థితి దెబ్బతింటుదన్నారు. రాష్ట్రాల

మాట్లాడుతున్న సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ సభ్యులు ఆర్ శంకరరావు

మిగతా 2లో..

నేటి నుంచి ఆడుదాం - ఆంధ్ర రాష్ట్ర స్థాయి క్రీడా సంబరం

జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం - ఆంధ్ర రాష్ట్ర స్థాయి క్రీడా సంబరానికి విశాఖ మహానగరం సిద్ధంగా ఉందని, అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు విశాఖపట్టణం వేదికగా జరగనున్న ఆడుదాం - ఆంధ్ర రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల షెడ్యూల్ వివరాలను వెల్లడించారు. అధికార యంత్రాంగం అన్ని రకాల చర్యలూ తీసుకుందని, ఈ క్రీడా సంబరాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలు, స్వచ్ఛంద సేవకులు, ఇతర వర్గాల ప్రతినిధులు భాగస్వామ్యం కావాలని, పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

26 జిల్లాల నుంచి 2,964 మంది క్రీడాకారులు రాక

ఈ క్రీడాపోటీలకు రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి 2,964 మంది క్రీడాకారులు, వారితో పాటు మరొక 500 మంది సాంకేతిక నిపుణులు విచ్చేస్తున్నారని కలెక్టర్ తెలిపారు. చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు, ప్రొ కబడ్డీ టీంకు శిక్షణాపరమైన సహకారం అందించిన నిపుణులు, వివిధ తెలుగు అసోసియేషన్ సభ్యులు కూడా వేడుకలకు హాజరవుతున్నారని తెలిపారు. ఐదు రకాల క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు ఒక్కో జిల్లా నుంచి ఒక మహిళా టీం,బాయ్స్ టీం మొత్తం 52 బృందాలు వస్తున్నాయని వివరించారు. వీరందరికీ ఆనందపురం మండలం దబ్బంద, మధురవాడ పరిధిలోని సుద్ధగెడ్డ టిడ్కో గృహాల్లో, ఎయు హాస్టళ్లలో వసతి కల్పిస్తున్నామని తెలిపారు. వీరంతా అక్కడి నుంచి క్రీడా మైదానాలకు చేరుకునేలా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామన్నారు. అల్పాహారం, భోజన సదుపాయం, తాగునీటి వసతి కల్పించామని పేర్కొన్నారు. ఆట మధ్యలో స్నాక్స్ ఇచ్చేలా కూడా చర్యలు తీసుకున్నామని వివరించారు.

ఆడుదాం - ఆంధ్రలో క్రికెట్, కబడ్డీ, బ్యాడ్మింటన్, ఖోఖో, వాలీబాల్ పోటీలు జరుగుతాయని వివరించారు. 9న ప్రారంభోత్సవ వేడుక రైల్వే స్టేడియంలో ఉండగా, ముగింపు వేడుక పిఎం పాలెంలోని ఎసిఎ క్రికెట్ స్టేడియంలో ఉంటుందని పేర్కొన్నారు. రైల్వే గ్రౌండ్, ఆంధ్రా మెడికల్ కాలేజీ, కొమ్మాదిలోని కెవికె.స్టేడియం, పిఎంపాలెంలోని డాక్టర్ వైఎస్సార్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలలో క్రికెట్ పోటీలు, ఎయులోని జిమ్నాషియం ఇండోర్ స్టేడియంలో కబడ్డీ, అవుట్

వివరాలు వెల్లడిస్తున్న విశాఖ జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

పార్టీల అధినేతలు ఢిల్లీ యాత్ర

చెబుతున్నారు. విశాఖపట్నం పార్లమెంట్ స్థానంపైనే వీరందరి గురీ ఉండడం విశేషం.

వైసిపి శ్రేణులేమంటున్నాయి?

రాష్ట్రంలో టిడిపి పూర్తిగా బలహీనపడినందున పొత్తుల కోసం అన్ని పార్టీల గడప తొక్కుతోందని వైసిపి నేతలు తాజాగా ఎద్దేవా చేస్తున్నారు. బిజెపి సహకారం లేకుంటే ఏపిలో జగన్‌ను ఓడించడం కష్టమైనందున కేంద్రంతో కనీసం పరోక్షంగానైనా పొత్తుకు వెళితే ఎంపీ, ఎమ్మెల్యే సీట్లను రాష్ట్రంలో తెచ్చుకోవచ్చన్న వైఖరితో టిడిపి అధిష్టానం ఉంది. మైనారిటీలు, దళిత, గిరిజనులు ఇతర చిన్న సామాజిక తరగతుల ఓట్లపై బిజెపితో ఏ పార్టీ చెలిమి చేసినా ప్రభావం ఉంటుందన్నది టిడిపి, వైసిపి గుర్తించినా మోడీ ప్రసన్నం కోసం ఎగబాకడం అటు చంద్రబాబు, ఇటు జగన్మోహన్‌రెడ్డి ఇద్దరూ పోటీపడుతున్నారు.

ఉత్తరాంధ్రలో లోకేష్ యాత్రలు...

టిడిపి యువనేత లోకేష్ ఈ నెల 11 నుంచి ఉత్తరాంధ్ర శంఖారావం పేరుతో పార్టీ శ్రేణులను ఉత్తేజ పరచడానికి గానూ 11 రోజుల పాటు 31 అసెంబ్లీ నియోజకవర్గాల్లో యాత్ర సాగించడానికి సిద్ధమయ్యారు. ఇప్పటికే వైసిపి బస్సు యాత్రలు పూర్తిచేసింది.

నేటి నుంచి ఆడుదాం - ఆంధ్ర
రాష్ట్ర స్థాయి క్రీడా సంబరం

డోర్ హాలులో ఖోఖో క్రీడలు, ఆంధ్రా యూనిర్శిటీ క్రీడా మైదానంలో వాలీబాల్, ఎంవిపి కాలనీలోని జివిఎంసి ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ క్రీడాపోటీలు జరుగుతాయని వివరించారు. ప్రతి గ్రౌండ్ వద్ద శాప్, క్రీడాప్రాధికార సంస్థ, జిల్లా యంత్రాంగం నుంచి ఇన్చార్జిలు ఉంటారని తెలిపారు.

రాష్ట్ర స్థాయి విజేతలకు రూ.87 లక్షలతో బహుమతులు

రాష్ట్ర స్థాయి విజేతలకు రూ.87 లక్షల విలువైన బహుమతులు ముగింపు రోజున అందజేయనున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. బ్యాడ్మింటన్ తప్ప మిగిలిన నాలుగు క్రీడల్లో రాష్ట్ర స్థాయి విజేతలకు ప్రథమ బహుమతి రూ.5 లక్షలు, ద్వితీయ రూ.3 లక్షలు, తృతీయ బహుమతిగా రూ.2 లక్షలు చొప్పున అందజేయనున్నట్లు వెల్లడించారు. బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయి విజేతలకు ప్రథమ బహుమతి రూ.2 లక్షలు, ద్వితీయ రూ.1లక్ష, తృతీయ బహుమతిగా రూ.50వేలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. వీరందరికీ ప్రత్యేక కిట్లు, టీ షర్ట్స్, టోపీలు అందజేస్తామని తెలిపారు.

9న క్రీడా మంత్రి, 13న సిఎం విశాఖకు రాక

ఈ క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమం ఈ నెల 9 న ఉదయం 10 గంటలకు రైల్వే మైదానంలో జరుగుతుందని, ముఖ్య అతిథిగా క్రీడా శాఖ మంత్రి విచ్చేసి పోటీలను ప్రారంభిస్తారని తెలిపారు. 13 న జరిగే ముగింపు వేడుకకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు.

విశాఖ జిల్లా నుంచి 114 మంది క్రీడాకారులు

విశాఖపట్టణం జిల్లా నుంచి 114 మంది రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొంటున్నారని వారిలో 57 మంది మహిళా, 57 మంది పురుష క్రీడాకారులు ఉన్నారని వివరించారు.

క్రీడా పోటీలు సజావుగా సాగేలా అన్ని రకాల చర్యలూ తీసుకున్నామని, పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశామని పోలీసు జాయింట్ కమిషనర్ ఫకీరప్ప తెలిపారు.

కేంద్రం నిరంకుశ చర్యలను ఖండించాలి

అభివృద్ధి కార్యక్రమాలపై ఇది తీవ్ర ప్రభావం చూపుతోందని చెప్పారు. అన్ని మానవాభివృద్ధి సూచికల్లోను కేరళ టాప్‌లో ఉందని, నాలెడ్జి ఎకానమీగా అవతరిస్తున్న తరుణంలో కేరళ వామపక్ష ప్రభుత్వంపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నీచమైన దాడులకు పాల్పడుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, కడప ఉక్కు ఫ్యాక్టరీ, అమరావతి రాజధానికి నిధులు, విభజన హామీలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయకుండా ఆంధ్ర ప్రజలను వంచిస్తుందన్నారు. రాష్ట్రాలపై కేంద్ర బిజెపి ప్రభుత్వ విద్రోహానికి వ్యతిరేకంగా కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రితో సహా ఆ రాష్ట్ర కేబినెట్ మంత్రులందరూ ఢిల్లీలో చేస్తున్న ధర్నాకు ఆంధ్రప్రదేశ్‌లోని అధికార, ప్రతిపక్ష పార్టీలు మద్దతు తెలియజేసి మన రాష్ట్ర హక్కుల సాధనకు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కన్వీనర్ పిఎస్.అజయ్‌కుమార్, సిపిఐ జిల్లా నాయకులు వైఎన్.భద్రం, రాజాన దొరబాబు, కాంగ్రెస్ నాయకులు ఐఆర్ గంగాధర్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గంటా శ్రీరామ్, వివి.శ్రీనివాసరావు, అల్లు రాజు, సిపిఎం మండల నాయకులు పి.శ్రీనివాసరావు, కె.తెల్లయ్యబాబు, బి.ఉమామహేశ్వరరావు, పి.చలపతి, బి.నూకఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

తాంబరం-సంత్రగచ్చి మధ్య ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ప్రయాణీకుల అదనపు రద్దీని క్లియర్ చేసే క్రమంలో భాగంగా తాంబరం-సంత్రగచ్చి-తాంబరం మధ్య ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగించినట్టు రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె త్రిపాఠి తెలిపారు. 06079 తాంబరం-సంత్రగచ్చి స్పెషల్ ఫిబ్రవరి 14, 21 తేదీల్లో ప్రతి బుధవారమూ మధ్యాహ్నం 13.00 గంటలకు తాంబరం నుంచి బయలుదేరి మరుసటి రోజు తెల్లవారు జామున 2:30 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అదే రోజు 20.45 గంటలకు సంత్రాగచ్చి చేరుకుంటుంది. 06080 సంత్రాగచ్చి - తాంబరం స్పెషల్ ఫిబ్రవరి 15, 22 తేదీల్లో ప్రతి గురువారమూ రాత్రి 23.40 గంటలకు సంత్రాగచ్చి లో బయలుదేరి మధ్యాహ్నం 16.55 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. మూడో రోజు ఉదయం 9.35 గంటలకు తాంబరం చేరుకుంటుంది. ఈ రైళ్ళు చెన్నై ఎగ్మోర్, గూడూరు, విజయవాడ, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, విజయనగరం, పలాస, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, భద్రక్, బాలాసోర్, ఖరగ్‌పూర్ మీదుగా ప్రయాణిస్తాయి. ఈ ప్రత్యేక రైళ్ల సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఎకె.త్రిపాఠి కోరారు.

విహార యాత్రికులను కాపాడిన లైఫ్ గార్డులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : రుషికొండ బీచ్‌లో దిగి ప్రమాదవశాత్తూ మునిగిపోతున్న హైదరాబాదుకు చెందిన షాన్ కుమార్ (32), సతీష్ (29)ను జివిఎంసి ఏర్పాటు చేసిన లైఫ్ గార్డ్ జి.అప్పన్న గురువారం రక్షించారని కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ నెల 2వ తేదీన ఇద్దరు బిహారీ పర్యాటకులను, 4వ తేదీన విశాఖ నగరానికి చెందిన ఎం.రాధికను జివిఎంసి లైఫ్‌గార్డులు కాపాడారని చెబుతూ వారి సేవలను కొనియాడారు. బీచ్‌లో పలుచోట్ల ప్రమాద హెచ్చరిక, సూచిక బోర్డులు ఏర్పాటుచేశామని, వాటిని గమనించాలని పర్యాటకులను సూచించారు. ఆర్‌కె.బీచ్ నుంచి భీమిలి తీర ప్రాంతం వెంబడి పలుచోట్ల ప్రజా రక్షణ కోసం జివిఎంసి లైఫ్ గార్డులను ఏర్పాటుచేసిందని తెలిపారు.

ఎంసికి జయగోపాల్ పార్థివదేహం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : భారత నాస్తిక సమాజం వ్యవస్థాపకులు, అంతర్జాతీయ మానవ హక్కుల నేత, సాంస్కృతిక ఉద్యమకారుడు ఆంధ్ర పెరియార్‌గా పేరు గాంచిన డాక్టర్ జయగోపాల్ కళ్లను ఎల్‌వి.ప్రసాద్ ఆసుపత్రికి, ఆయన పార్థివ దేహాన్ని ఆంధ్ర మెడికల్ కళాశాలకు కుటుంబ సభ్యులు దానం చేశారు. బుధవారం సాయంత్రం ఆరిలోవలోని తన స్వగహంలో జయ గోపాల్ తుది శ్వాస విడిచిన విషయం తెలిసిందే. గురువారం ఉదయం ఆరిలోవలోని ఇంటి నుంచి ఊరేగింపుగా బయలుదేరి పార్థివ దేహాన్ని ఆంధ్ర మెడికల్ కళాశాలకు కుటుంబ సభ్యులు అప్పగించారు. భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు టి.శ్రీరామ్మూర్తి, జిల్లా కార్యదర్శి వై.నూకరాజు, ఆర్‌ఎస్‌వి.మురళి, వర్మ, మానవ హక్కుల వేదిక నాయకులు విఎస్.కృష్ణ, సిపిఐ నాయకులు జెవి.సత్యనారాయణమూర్తి, ఎపిటిఎఫ్ నాయకులు వేణు తదితరులు అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

11నుంచి ఉత్తరాంధ్రలో లోకేష్ పర్యటన

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఈ నెల 11 నుంచి 11 రోజులపాటు ఉత్తరాంధ్రలో పర్యటించనున్నారని టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, రోజుకు 3 నియోజకవర్గాల్లో కేడర్‌తో సమావేశాలు జరుపుతారని తెలిపారు. ఈ నెల 11 నుంచి "శంఖారావం" పేరుతో. శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురం నుంచి ప్రారంభం కానుందని పేర్కొన్నారు. 11రోజులపాటు 31 అసెంబ్లీ నియోజకవర్గాలను కవర్ చేస్తూ ఈ యాత్ర సాగనుందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు, దోపిడీ విధానాలను ప్రజల్లో ఎండగట్టడం, అదే సమయంలో వివిధవర్గాలకు భరోసా కల్పిస్తూ అధినేత ప్రకటించిన సూపర్ సిక్స్ కార్యక్రమాలపై ప్రజలను చైతన్యవంతం చేస్తారని వివరించారు.

నేడు యువశక్తి సదస్సు

మాట్లాడుతున్న శ్రీనుబాబు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మన భవిష్యత్తును మనమే నిర్ణయించుకుందామనే లక్ష్యంతో శుక్రవారం నగరంలోని గురజాడ కళాక్షేత్రంలో 'యువశక్తి' సదస్సు నిర్వహించనున్నట్టు పల్సస్ గ్రూపు సంస్థల సిఇఒ డాక్టర్ గేదెల శ్రీనుబాబు తెలిపారు. నగరంలోని మేఘాలయ హోటల్‌లో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రైతులు తమ పంటను తామే మార్కెటింగ్ చేసుకునేందుకు, విద్యార్థులు తమ కాళ్లపై తామే నిలబడేందుకు అనుసరించాల్సిన విధానాలను ముగ్గురు నిపుణులు వివరిస్తారని తెలిపారు.

ఇప్పటికే తాము యువశక్తి, రైతుశక్తి పేరిట ఉత్తరాంధ్ర జిల్లాల్లో వేలాది మందికి చేరువయ్యామని, త్వరలో ఎపి వ్యాప్తంగా ఇలాంటి సదస్సులు నిర్వహించి 2 కోట్ల మందికి చేరువ కానున్నామని తెలిపారు. విద్యార్థులే రేపటి పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలన్నదే తమ లక్ష్యమన్నారు. విశాఖ ఆర్థిక వ్యవస్థను 100 బిలియన్ల స్థాయికి తీసుకెళ్తామని చెప్పారు. ఐదేళ్ల వ్యవధిలో పల్సస్ సంస్థ భారీ సంఖ్యలో ఉద్యోగాలు కల్పించిందని తెలిపారు. ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ రంగంలో తాము ఇప్పటికే పెట్టుబడులు పెట్టామని, స్థానికంగా ఉన్నవారిలో 80 శాతం మందికి పల్సస్ ఉద్యోగాలు ఇచ్చిందని చెప్పారు. శుక్రవారం జరగనున్న సదస్సుకు ఇంజినీరింగ్, పీజీ విద్యార్థులు హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించవచ్చని తెలిపారు.

పొగాకు అనర్థాలపై ర్యాలీ

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: పొగాకు వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఎన్‌సిసి 4ఎ నేవల్ మెడికల్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని యూనిట్ కమాండింగ్ ఆఫీసర్ సర్జన్ కమాండర్ జయంత్ పాండా ఎంవిపి కాలనీలోని కార్యాలయం వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పొగాకు వినియోగం వల్ల అనేక అనారోగ్య సమస్యలు కలుగుతాయన్నారు. కేన్సర్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండటం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు.

CHANGE OF NAME

I, **RAJYALAKSHMI RAGHUPATI, W/o VENKATARAMANA RAGHUPATI,** D.No. 24-342/2, Sivasakthinagar, Kommadi, Madhurawada, Visakhapatnam, Andhra Pradesh, India, Pin Code: 530048, have changed my name from **NEERAJA RAGHUPATI** (old name) to **RAJYALAKSHMI RAGHUPATI** (new name). Hence after all my documents and correspondence will continue with my new name **RAJYALAKSHMI RAGHUPATI.**

In the Court of the Hon'ble Addl. Senior Civil Judge, Eluru
O.S. No. 83/2022

Between:
Choppavarapu Rambabu and Others ***...Plaintiffs***
AND
Kotha Kodanda Srinivasa Karunakar and Others ***...Defendants***

To:
D-3: Adapa Venkata Srinivasa Nehru, S/o. Narayana Murthy, D.No. 2-51/9A, Lakshmi Street, Daba Gardens, Visakhapatnam, Visakhapatnam District.
D-4: Mupparthi Padmavathi, W/o. Venkateswara Rao, D.No. 2-51/9A, Lakshmi Street, Daba Gardens, Visakhapatnam, Visakhapatnam District.

పై నెంబరు దావా గ్రంధములో శ్రీ కోర్టు వారు ప్రతివాదులు 3 మరియు 4 వారలు హాజరు నిమిత్తం పలుమార్లు సమన్లు ఆర్డరు వేసినప్పటికీ మీరు తీసుకొనక కాలయాపన చేసినందున మీ యొక్క హాజరు నిమిత్తం **ది. 26-02-2024వ తేదీన ఉదయం గం|| 10.30 ని||లకు** వాయిదా వేసియున్నారు. కావున మీరు స్వయంగా గానీ, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు కాని యెడల మీ పరోక్షమున పై నెంబరు దావా గ్రంధము పరిష్కరించబడునని తెలియజేయడమైనది.

G.V.ANAND KUMAR, Advocate
Eluru, Cell: 9848427001

మహారాజశ్రీ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, బొబ్బిలిలో
I.A.896/2022 in O.S.206/2022

Between:
బొంగు సత్యన్నారాయణ .....పిటిషనర్/వాది
And:
బూరాడ సత్యనారాయణ వగైరాలు...రెస్పాండెంట్లు/ప్రతివాదులు
To:-
<u>1వ ప్రతివాది/రెస్పాండెంటు</u>
బూరాడ సత్యన్నారాయణ తండ్రి లేటు అప్పలనాయుడు, వయస్సు 67 సం.లు, డోర్ నెం.13-9-33, మార్వాడి లేన్, భుజంగపురం, విశాఖపట్నం అర్బన్, విశాఖపట్నం జిల్లా.

పై నెంబరు దావాలో పైన పేర్కొన్న 1వ ప్రతివాది రెస్పాండెంటుకు, కోర్టు నుండి ఎన్ని పర్యాయములు సమన్లు/నోటీసులు పంపినను పుచ్చుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీకోర్టువారు పేపర్ పబ్లికేషన్ ద్వారా నోటీసు అమలుకు సదరు దావాను **<u>తేది.26.02.2024</u>**న కోర్టువారు వాయిదా వేసియున్నారు. కావున సదరు **<u>తేది.26.02.2024న ఉదయం 10.30 గం.</u>**లకు పైన తెలిపిన కోర్టునందు స్వయముగాగాని, వకీలుద్వారాగాని హాజరు అయి, ఆక్షేపణలు ఉన్న ఎడల తెలుపు కొనవలెను. లేని ఎడల మీ పరోక్షమందు సదరు వ్యాజ్యమును తీర్మానించబడును.

(శ్రీకోర్టువారి ఉత్తర్వు ప్రకారం)

బొబ్బిలి
తేది: 08.02.2024
బొత్స రవి
అడ్వకేట్, బొబ్బిలి.

IN THE HON'BLE COURT OF THE II ADDL. SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
E.P.227/2021 in O.S.1426/2015

Between:
Kottana Anna Mary ...D.Hr/Plaintiff
And:
Rampathri Simhachalam & another ...J.Drs/Defendants

NOTICE

To,
J.Dr No.1:
Rampathri Simhachalam,
S/o. Krishna Murthy,
Hindu, aged about 55 years,
R/at. D.No.13-117,
Shyam Nagar Colony,
Madhurawada, Visakhapatnam.
J.Dr No.2:
Rampathri Adi Lakshmi,
W/o. Simhachalam,
Hindu, aged about 53 years,
R/at. D.No.13-117,
Shyam Nagar Colony,
Madhurawada, Visakhapatnam.

Please take notice that the above named D.Hr/plaintiff filed the case against you for under Section 21 Rule 54, 64, 66 for Code of Civil Procedure,1908 and the matter stands posted to **06-03-2024** for your appearance either in person by an authorized representative at **10:30 A.M** before the Hon'ble Court of the II Addl. Senior Civil Judge at Visakhapatnam, failing which the matter will be decided in your absence.

(By Order of the Hon'ble Court)

POLINAIDU VUDAMALA,
Advocate
Anthony Nagar, Visakhapatnam.
Cell: 9966631486.

మహారాజశ్రీ కాకినాడ 3వ అదనపు సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
E.P. 149/2020 in O.S. 57/2006

Between :
1) Mummidi Satyanarayana
2) Gurrala Nagendra Prasad
...Decree Holders
and
1) Nidadavolu Sambharaju (Died) & Others ...Judgement Debtors
To,
JDr - 3 : Nidadavolu Surynarayana Raju,
S/o. (Late) Sambharaju,
Green Gardens,
Marripalem, Visakhapatnam.

పై నెంబరు అమలు గ్రంధములో మీకు కోర్టువారు ఎన్నిసార్లు నోటీసులు పంపినప్పటికీ మీరు తీసుకునియుండలేదు. కావున మీ హాజరు నిమిత్తం కోర్టువారు **ది. 23-02-2024వ తేదీ** నాటికి వాయిదా వేసియున్నారు. ఆ రోజు **ఉదయం గం. 10-30 ని||లకు** మీరు స్వయముగా గానీ, ప్లీడరు గారి ద్వారా గానీ హాజరయ్యి ఆక్షేపణలు ఉన్న ఎడల తెలుపుకొనవచ్చును. లేని ఎడల ఏమీ లేవని మీ పరోక్షమున తీర్మానించెదరు.

అద్దేపల్లి మురళీధర్
డిక్రీ హోల్డర్ తరపు అడ్వకేట్
కాకినాడ. ప్రతాప్ నగర్, కాకినాడ.
ది.08-02-2024 సెల్: 9849170270

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఒకటో వార్డు బాలాజీ నగర్, రాజవీధి, చిట్టివలస ప్రాంతాల్లో జివిఎంసి నిధులతో చేపట్టనున్న సిమెంట్ రోడ్లు, కాల్వల నిర్మాణ పనులకు గురువారం స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జెడ్‌సి శైలజ వల్లి, ఎఇఇ, సుమన్, జివిఎంసి కోఆప్షన్ సభ్యులు కొప్పల ప్రభావతి, పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రాము నాయుడు, వైసిపి నాయకులు జగుపిళ్ల ప్రసాద్ పాల్గొన్నారు

సీతమ్మధార :జివిఎంసి 46వ వార్డు శ్రామికనగర్ కొండవాలు ప్రాంతంలో రూ.10లక్షలతో సిసి రోడ్లు, డ్రైనేజీ పనులకు డిప్యూటీ మేయర్, స్థానిక కార్పొరేటర్ కట్టమూరు సతీష్ గురువారం శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డు పరిధిలో కస్తూరినగర్, లక్ష్మీనారాయణ పురం ప్రాంతాల్లో రూ.6కోట్ల జివిఎంసి నిధులతో డ్రైనేజీ పనులు పూర్తిచేశామన్నారు. శాంతినగర్లో వార్డు సచివాల యం పరిధిలో రూ.రెండు కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. వార్డు పరిధిలో 80శాతం మేర అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో జివిఎంసి కోఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, శ్రామిక నగర్ అధ్యక్షులు సింగంపల్లి రామారావు, గోవింద్, కృష్ణ వర్క్ ఇన్‌స్పెక్టర్ నర్సింగరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి- తగరపువలస : విశాఖ సంధ్య ఐ హాస్పిటల్ సౌజన్యంతో స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులకు గురువారం ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. కళాశాల ఎన్ ఎస్ ఎస్ విభాగం ఆధ్వర్యాన నిర్వహించిన శిబిరంలో ప్రిన్సిపల్ డాక్టర్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఎ చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి షరీఫ్ పాల్గొన్నారు

నేర నియంత్రణకు సిసి కెమెరాలు కీలకం

ప్రజాశక్తి -తగరపువలస : నేరాల నియంత్రణకు సిసి కెమెరాలు నిఘా ఎంతో కీలకమని భీమిలి సిఐ డి.రమేష్ స్పష్టం చేశారు. గురువారం బాలాజీనగర్, చిట్టివలస, పెరికివీధి ప్రాంతాల్లో సిసి కెమెరాల ఆవశ్యకతపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సులువుగా డబ్బులు సంపాదించాలన్న దురాలోచనతో కొందరు తప్పుడు మార్గాలను ఎంచుకుని, నేరాలకు పాల్పడుతున్నారన్నారు. ఈ తరహా నేరాలను అరికట్టేందుకు సిసి కెమెరాల ఫుటేజీ కీలక ఆధారంగా ఉపయోగపడుతుందన్నారు. నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలని కోరారు

98వ వార్డులో 'జనంతో జనసేన'

ప్రజాశక్తి- సింహాచలం: జివిఎంసి 98వ వార్డులో గురువారం జనంతో జనసేన కార్యక్రమం నిర్వహించారు. టిడిపి, జనసే నేతలు ఉమ్మడిగా వార్డులో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ముందుగా తొలి పావంచా వద్ద పూజలు చేసి, పాదయాత్రను ప్రారంభించారు కార్యక్రమంలో జనసేన భీమిలి ఇంచార్జ్ పంచకర్ల సందీప్, వార్డు టిడిపి కార్పొరేటర్ పివి.నరసింహం పాల్గొన్నారు. సాయంత్రం నిర్వహించిన బహిరంగ సభలో మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ, జనసేన నేతలు శివశంకర్, పంచకర్ల సందీప్, టిడిపి పార్లమెంటరీ కమిటీ కార్యదర్శి పాసర్ల ప్రసాద్ మాట్లాడారు. వార్డు జనసేన అధ్యక్షులు మజ్జి సూరిబాబు, టిడిపి, జనసేన నేతలు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన

విద్యార్థికి యునాని మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - భీమునిపట్నం :స్థానిక ఆయుష్ శాఖ ఆధ్వర్యాన జివిఎంసి ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక యునాని ఆసుపత్రి వైద్యులు ప్రతిభ, సిఒ మీనాక్షి, కౌన్సిలర్ సత్యవతి మాట్లాడుతూ, యునాని వైద్యవిధానంలో అన్ని రకాల అనారోగ్య సమస్యలు, వ్యాధులు నయమౌతాయన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో యునాని సేవలను సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాల హెచ్‌ఎం సిహెచ్ సింహాచలం, ఉపాధ్యాయులు సుజాతకుమారి, ఎ శ్రీనివాసరావు, మరగడ రామకృష్ణ, లక్ష్మి పాల్గొన్నారు

నేడే సింహాద్రి అప్పన్న తెప్పోత్సవం

విజయవంతంగా ట్రయల్ రన్

ప్రజాశక్తి- సింహాచలం : సింహాద్రి అప్పన్న తెప్పోత్సవానికి సర్వం సిద్ధమైంది. ఈనెల 9న, శుక్రవారం సాయంకాలం కొండదిగువ వరహా పుష్కరిలో 5:30గంటలకు స్వామి హంస వాహనంపై పుష్కరిణి చెరువులో విహరించేందుక అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం సాయంకాలం ఎసిపి అన్నెపు నరసింహ మూర్తి, గోపాలపట్నం సిఐ సురేష్ తదితరులతో కలిసి, ఆలయ ఇఒ ఎస్ శ్రీనివాసమూర్తి, దేవస్థానం ఇఇ శ్రీని వాసరాజు, రాంబాబు ఆధ్వర్యంలో ట్రయిల్ రన్ నిర్వహించారు. స్వామి విహరించే పడవను సర్వాంగ సుందరంగా విద్యుద్దీపాలతో అలంకరించారు. ఎటు వంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా గజ ఈతగాళ్లను సిద్ధం చేశారు. భారీగా వచ్చే భక్తులకు ఇబ్బం దులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఇఒ తెలిపారు.

వేడుకలో భాగంగా శుక్రవారం ఉదయం దేవాలయ అర్చక బృందం సంప్రోక్షణ చేస్తారు. సాయంత్రం 4గంటలకు వేణుగోపాలుడు అలంకరణలో స్వామి మెట్ల మార్గంలో కొండదిగువ తొలి పావంచా చేరుకుంటారు. అక్కడినుంచి పుష్కరిణికి చేరుకొని, ప్రత్యేక వేదికపై ఐదున్నర గంటలకు భక్తులకు

ట్రయల్ రన్‌లో పాల్గొన్న పోలీసులు, దేవస్థానం అధికారులు

దర్శనమిస్తారు అనంతరం హంసవాహనంపై జల విహారం చేస్తారు రాత్రి 7:15 గంటల వరకు పుష్కరిణి మధ్యలో ఉన్న మండపంలో పూజలు నిర్వహిస్తారు. తర్వాత పుష్కరిణి సత్రము వద్దకు చేరుకొని, 8:15గంటల నుంచి సర్వజన మనోరంజని వాహనంపై మాడవీధుల్లో తిరువీధి ఉత్సవాన్ని నిర్వహిస్తారు. తర్వాత పైడితల్లమ్మ గుడి వరకు వెళ్లి, మెట్ల మార్గంలో కొండపైకి చేరుకుంటారు. ఈ సందర్భంగా కొండపై స్వామి దర్శనాలు శుక్రవారం సాయంత్రం 6గంటల వరకు మాత్రమే భక్తులకు స్వామి ఉంటుందని ఆలయ అధికారులు వెల్లడించారు. శనివారం ఉదయం సుప్రభాత సేవ, ఆరాధన సేవా టికెట్లు రద్దుచేశారు.

పెద్దిపాలెంలో క్రికెట్ టోర్నీ ప్రారంభం

క్రికెట్ టోర్నీ ప్రారంభోత్సవంలో ఆటగాళ్లతో రాజుబాబు

ప్రజాశక్తి - ఆనందపురం : మండలంలోని పెద్దిపాలెంలో తెలుగుదేశం సీనియర్ నాయకులు మరుపిల్ల బంగారునాయుడు 59వ జయంతిని పురస్కరించుకుని ఆయన జ్ఞాపకార్థం అతని కుమారుడు, తెలుగు యువత భీమిలి నియోజకవర్గ ఆర్గనైజింగ్ సెక్రటరీ మరుపిల్ల సాయిజ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో గురువారం క్రికెట్ టోర్నీని నిర్వహించారు. భీమిలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు టోర్నీ ప్రారంభించారు. విజేతలకు శుక్రవారం బహుమ తులను అందజేయనున్నారు. ఈ సందర్భంగా మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బొద్దాపు శ్రీనివాస్, విశాఖ పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మీసాల సత్యనారా యణ, నియోజకవర్గ వాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి గుండు చిన్నబాబు, మాజీ ఎంపిపి చెన్న నర్సింగరావు, వెల్లంకి ఎంపిటిసి పడాల అప్పలనాయుడు, మాజీ ఎంపిటిసిలు పల్లెంటి సూరిబాబు,లోడగల వెంకటరావు , చిన్నరాజు, మరుపిల్ల చిన్నయ్యపాత్రుడు పాల్గొన్నారు

ముగిసిన తెలుగు చలన చిత్రోత్సవం

ప్రజాశక్తి- సీతమ్మధార : వైజాగ్ ఫిల్మ్ సొసైటీ సామాజిక బాధ్యతగామూడురోజులగా నిర్వహించిన తెలుగు చలన చిత్రోత్సవం గురువారంతో ముగిసింది. 1932 ఫిబ్రవరి 6న తొలి తెలుగు టాకీ సినిమా భక్త ప్రహ్లాద హెచ్‌ఎమ్ రెడ్డి దర్శకత్వంలో విడుదలై సంచలనం సష్టించిన రోజున ఏటా తెలుగు సినిమా దినోత్సవం జరుపుకుంటున్నారు. ఇందులో భాగంగా ద్వారకా నగర్ పౌరగ్రంథాలయంలో మూడు రోజులు చిత్రోత్సవాన్ని నిర్వహించారు. అలనాటి చిత్రాలను ప్రదర్శించారు. 6న బంగారుపాప (1955), 7న జయభేరి, 8న బలగం (2023) సినిమాలను ప్రదర్శించారు. ముగింపు సమావేశంలో సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ, ఇతర రాష్ట్రాలలో ఇటువంటి ఫెస్టివల్స్‌ను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుంటే, మన రాష్ట్రంలో అందుకు విరుద్ధంగా సినీ పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం రిక్తహస్తాన్ని అందించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఫెస్టివల్‌లో బలగం.చిత్రాన్ని ప్రదర్శించి, దానిపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో సొసైటీ అధ్యక్షులు ఎన్ఎడి పాల్, ఉపాధ్యక్షులు కాశీవిశ్వేశ్వరరావు, బి.చిన్నారావు, హుస్సేన్, చాట్ల బాబూరావు, రెడ్డి ఉషారాణి, డాక్టర్ బాబ్జి పాల్గొన్నారు

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు హిందువులు కారా?

బిజెపి సమాధానం చెప్పాలి : జెఎసి దీక్షలో పి.వెంకటరెడ్డి

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం) :హిందువులు 90 శాతం మంది ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుకు అప్పజెప్పడం హిందువులకు ద్రోహం చేసినట్లు కాదా? అని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజాసంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు గురువారం నాటికి 1043వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా పి.వెంకటరెడ్డి మాటా డుతూ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం, తన తప్పిదాలను పక్కదారి పట్టించ డానికి హిందూ మతాన్ని అడ్డు పెట్టుకొంటున్నారని విమర్శించారు. అంబానీ, ఆదానీ, జిందాల్ లాంటివారికి దేశాన్ని తాకట్టు పెట్టడం బాధాకరమన్నారు. త్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను మొదట పోస్కో, తర్వాత అదాని, ఇప్పుడు జిందాల్‌కు అమ్మడానికి ప్రయత్నం చేయడం దేశద్రోహులు చేసే పని కాదా అని

దీక్షల్లో జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నేతలు

ప్రశ్నించారు. రోజూ హిందూ మతం జపం చేసే మోడీకి స్టీల్‌ప్లాంట్‌లో ఉన్న హిందువులు కనబడలేదా అని ప్రశ్నించారు. గతంలో ప్రభుత్వాలు ప్రజల డబ్బుతో ప్రభుత్వరంగ సంస్థలను ఏర్పాటుచేసి దేశానికి అంకితం చేస్తే ఇప్పుడు బిజెపి పాలకులు గుజరాతీలైన అంబానీ, అదానీలకు అంకితం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రయివేటీకరణ విధానాలను విడనాడకపోతే వచ్చే సార్వత్రిక ఎన్నికలలో బిజెపి, దానికి మద్దతు ఇస్తున్న టిడిపి, జనసేన, వైసిపిలకు తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు, కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ దీక్షల్లో పి.అనిల్‌కుమార్, అశోక్, స్వామి, అభి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : మండలంలోని ఎల్.శింగవరం గ్రామానికి చెందిన రేణం సాయికుమార్ (22) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం... వడ్డాది గ్రామ సమీపంలో సరుగుడు తోటలో గడ్డిమందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్న సాయికుమార్‌ను కుటుంబీకులు వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ వైద్య సేవలు పొందుతూ, ఆరోగ్యం విషమించడంతో గురువారం కేజీహెచ్‌లో మృత్యువాత పడ్డాడు. మద్యానికి బానిసై, కొంతకాలంగా ఖాళీగా తిరుగుతున్న మృతుడిని కుటుంబీకులు మందలించడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని సోదరుడు గణేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

18 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి- కె.కోటపాడు : దేవరాపల్లి ఏజెన్సీ నుండి అక్రమంగా రవాణా చేస్తున్న 18 కేజీల గంజాయిని మండలంలోని వారాడలో పట్టుకున్నట్లు ఎ.కోడూరు ఎస్సై రమేష్ తెలిపారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన నరేంద్ర తుకారాం చిట్టా తన కారులో 18 కేజీల గంజాయిని హైదరాబాద్‌కు రవాణా చేస్తుండగా పట్టుబడ్డారు. ఈ గంజాయి విలువ 90 వేలు ఉంటుంది. కారును సీజ్ చేసి తుకారామ్‌ను అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని తురకలపూడి గ్రామంలో మద్యం అక్రమంగా అమ్ముతున్న గంట్ల పైడినాయుడు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని,అరెస్ట్ చేసినట్లు బుచ్చయ్యపేట ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. నిందితుని నుంచి 30 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

అట్రాసిటీ కేసుపై ఎసిపి దర్యాప్తు

అట్రాసిటీ కేసులో విచారిస్తున్న ఎసిపి త్రినాథ్

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్ ట్రైనింగ్ సెంటర్ వద్ద జరిగిన గొడవకు సంబంధించి నమోదైన ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుపై సౌత్ జోన్ ఎసిపి త్రినాథ్ గురువారం దర్యాప్తు నిర్వహించారు. ట్రైనింగ్ సెంటర్ హెడ్ నల్లి భాను చేసిన ఫిర్యాదు మేరకు ఫిర్యాదుదారుతోపాటు సాక్షులు సోమయాజులు, రామ కృష్ణ తదితరులు విచారించారు. ఎసిపితోపాటు స్టీల్ సిఐ వి.శ్రీని వాసరావు, స్టీల్‌ప్లాంట్ ఎస్‌సి, ఎస్‌టి యూనియన్ నేతలు బయ్యే మల్లయ్య, బండ తౌడన్న, మోహన్‌బాబు, పుల్లారావు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసనా సామర్థ్యం పరిశీలన

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గురువారం స్థానిక ప్రభుత్వ డైట్ ప్రిన్సిపల్ ఎల్.సుధాకర్ , లిప్ బృందంతో కలిసి పర్యటించారు. 6,7,8 తరగతుల్లో ప్రతి సబ్జెక్ట్‌లో గడచిన మూడు నెలల్లో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను, టీచర్ల బోధనా పద్ధతులను పరిశీలించారు. చదవడం, రాయడం, చెప్పిన విషయాలు అర్థం చేసుకోవడం వంటి అంశాలపై లిప్ బృందం పరిశీలించింది. మార్చి నెలాఖరు నాటికి విద్యార్థులు అన్ని సబ్జెక్ట్‌ల్లోనూ పూర్తి సామర్థ్యం కలిగిఉండేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. లిప్ బృందం సభ్యులు, డైట్ అధ్యాపకులు ఎస్ త్రినాథరావు, ఎం మహాలక్ష్మి, పి హరిణి, హెచ్ ఎం రమణ పాల్గొన్నారు



విద్యార్థులతో మాట్లాడుతున్న డైట్ ప్రిన్సిపల్ సుధాకర్

మురుగునీటితో కాజ్‌వే ఛిద్రం!

మురుగునీరు చేరడంతో గుంతలమయమైన కాజ్‌వే

- గోస్తనీ బ్రిడ్జి నిర్మాణానికి వేసిన శిలాఫలకం తెంచిన తంటా
- రాకపోకలకు పాదచారులు, వాహనదారుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-పద్మనాభం : జనాభాపరంగా మండలంలోనే మూడవ అతి పెద్దపంచాయతీ పాండ్రంగి రాకపోకలకు ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. పాండ్రంగి ప్రవేశానికి ముందే గోస్తని నదిలో వేసిన కాజువేపైకి గ్రామం నుంచి వచ్చిన వాడకం మురుగునీరు గోస్తనీ నదిలోకి వెళ్లకుండా, కాజువేపైకి చేరుతోంది. దీంతో పాండ్రంగిలోకి వెళ్లలన్నా, గ్రామస్తులకు బయటకు రావాలన్నా ప్రధానమార్గమైన ఈ కాజ్‌వేపై మురుగునీరు చేరడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. దుర్వాసన వెదజల్లడంతోపాటు మురుగునీరు కాజ్‌వేపైనే నిలవడంతో రోడ్డంతా గోతులమయమై ఛిద్రంగా తయారైంది. ఈ మార్గంలోని గ్రామ సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఇతర ఉద్యోగులు, ఉపాధ్యాయులతోపాటు స్థానిక నేతలు, ఇతర ప్రాంతాల నుంచి గ్రామానికి వచ్చే నేతలు, అధికారులంతా ఇదే మార్గంలోనే రాకపోకలు సాగించాల్సి ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో కాజ్‌వేపై నిలిచిన మురుగునీటిని దాటి వెళ్లేందుకు ప్రతిఒక్కరూ ఇబ్బంది ఫీలవుతున్నారు.

ఎమ్మెల్యే వేసిన శిలాఫలకం తెచ్చిన తంటా

గోస్తనీ నదిపై వంతెన నిర్మాణానికి ఇటీవల స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. అంతవరకు బాగానే ఉంది.. కానీ శంకుస్థాపనకు వేసిన శిలాఫలకం దిమ్మను గ్రామం నుంచి గోస్తనీ నదిలోని వాడిక మురుగునీరు వెళ్లే మార్గంలో అడ్డంగా నిర్మించడం వల్ల అసలు సమస్య ఉత్పన్నమైంది. దీంతో మురుగునీరు నదిలోకి పోకుండా, కాజ్‌వే పైకి వచ్చి నిలిచిపోతోందని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా పంచాయతీ యంత్రాంగం, అధికారులు, నేతలు స్పందించి, పాండ్రంగికి వెళ్లే మార్గంలో కాజ్‌వేపై నెలకొన్న దుర్గంధం, మురుగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతున్నారు.

దీక్షలో 'ఉక్కు' పెన్షనర్లు

ఆందోళనలో భాగంగా ధర్నా చేస్తున్న పెన్షనర్లు

ప్రజాశక్తి -కరాస: తమ సమస్యల పరిష్కారానికి ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్, జిల్లా కమిటీ ఆధ్వర్యాన మద్రిపాలెం పిఎఫ్ కార్యాలయం వద్ద చేపడుతున్న రిలేదీక్షలు నాలుగో రోజుకు చేరాయి. గురువారం దీక్షల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ పర్సన్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె దీనబంధు, ప్రధాన కార్యదర్శి ఎస్‌కె. హుస్సేన్ మాట్లాడుతూ, పెన్షనర్ల సమస్యల పట్ల కేంద్రప్రభుత్వం వైఖరి దుర్మార్గమని, విభిన్న రూపాల్లో ఆందోళనలు చేస్తున్నా కనీసం స్పందించం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఎం.కృష్ణారావు, బి సత్యనారాయణ, బి నాగేశ్వరరావు, ఎస్‌ఆర్ మూర్తి, అప్పలరాజు, సూర్య ప్రకాశరావు, కెపి కుమార్ పాల్గొన్నారు

నేడు చట్టాలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ఈనెల 9న శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటలకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు భీమిలి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ జనార్ధనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు ఈ సదస్సుకు హాజరు కావాలని ప్రజలను కోరారు.

యాత్ర -2 విజయోత్సవ సంబరాలు

థియేటర్ వద్ద వైసిపి శ్రేణులతో సందడి చేస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి -సీతమ్మధార : విశాఖ ఉత్తర నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో యాత్ర-2 చిత్ర విజయోత్సవాన్ని నిర్వహించారు. నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు కేకు కట్‌చేశారు. అంతకు ముందు ఊర్వశి థియేటర్‌లో పార్టీ శ్రేణులతో కలిసి యాత్ర -2 సినిమా మొదటిషోను తిలకించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సినిమాలో రాజన్న ఆశయం, జగనన్న లక్ష్యం కళ్లకు కట్టినట్లు చూపించారన్నారు. సినిమాలో విపక్షాల కుట్రలను, సిఎం జగన్ ప్రజలకు మంచి చేయాలన్న తపనను చూపించారన్నారు

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

సీతమ్మధార : 'గుడ్ మార్నింగ్ నార్త్' కార్యక్రమంలో భాగంగా 48, 49 వార్డుల పరిధిలోని ఊర్వశి జంక్షన్, బర్మా క్యాంప్, శ్రీనివాసనగర్ ప్రాంతాలలో డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ అల్లు శంకరరావు, 48వ వార్డు ఇన్‌ఛార్జి నీలి రవితో కలిసి ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త కెకె రాజు క్షేత్ర పర్యటన చేశారు. ఈ సందర్భంగా రూ.2.16కోట్లతో ఊర్వశి జంక్షన్ నుంచి బర్మా క్యాంప్, శ్రీనివాసనగర్, మధుసూదన నగర్ వరకు నిర్మించిన 40అడుగుల బిటి.రోడ్డు పనులను పరిశీలించారు. స్థానికుల సమస్యలను అడిగి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డిఇఇ భరణి, ఎఇఇ టి.సాయినాథ్, సీనియర్ నేతలు రాజాన గంగరాజు, రుత్తల రాంబాబు, సబ్బవరపు శ్రీను, శంకర్, కిషోర్, సి.హెచ్ శ్రీను, శివరాం పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలనలో అప్రమత్తత

సీతమ్మధార : జాబితాల్లోని ఓటర్ల పరిశీలనలో పోలింగ్ బూత్ ఏజెంట్లు అప్రమత్తతతో వ్యవహరించాలనిఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్ కెకె రాజు అన్నారు. గురువారం నియోజకవర్గ పరిధిలోని 45వ వార్డు పోలింగ్ బూత్ ఏజెంట్లు ముఖ్య నాయకులతో వాసుదేవనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఆ వార్డు కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోక్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు వైసిపి అధ్యక్షుడు పైడి రమణ, జెసిఎస్ మండల కన్వీనర్ వసంతల అప్పారావు, సీనియర్ నాయకులు హరివెట్నాయక్, నాగరాజు, నేపాల్ శ్రీను, సన్నీనాయుడు, దుర్గ, నాని, ఆది లక్ష్మీసువర్ణ, నరసరావు పాల్గొన్నారు.

మలేరియా విభాగ కార్మికులను పర్మినెంట్ చేయాలి

కార్మికులతో సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి మలేరియా విభాగంలో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ కార్మికులుగా గుర్తించి, వారికి ప్రభుత్వపరంగా ప్రయోజనాలను కల్పించాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, గాజువాక జోన్ కమిటీ నాయకులు, గొలగాని అప్పారావు, ఎం. రాంబాబు, డిమాండ్ చేశారు. గురువారం గాజువాకలో నిర్వహించిన యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడుతూ, ప్రభుత్వం సీజన్ వ్యాధులకు అనుకూలంగా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సేవకులుగా మలేరియా వర్కర్లుతో తాత్కాలికంగా పనిచేయించుకోవడం దుర్మార్గమన్నారు. మలేరియా కార్మికులను రెగ్యులర్ కార్మికులుగా గుర్తించడంతోపాటు, మధ్య దళారీల ప్రమేయాన్ని నివారించాలన్నారు. కాలనీలు, వాడల విస్తరణతో వీరికి పనిభారం పెరుగుతోందని, అదనపు కార్మికులను నియమించడం ద్వారా, ప్రయోజనాలను గానీ కల్పించడం లేదన్నారు. దోమల నివారణకు నాసిరకం కెమికల్స్ వాడడం వల్ల ప్రజాధనం దుర్వినియోగమే తప్ప ప్రయోజనం ఉండడం లేదన్నారు. కార్మికులకు సేఫ్టీ పరికరాలు సబ్బులు, మాస్కులు, గ్లౌజులు, రెయిన్ కోట్‌లు ఇవ్వాలన్నారు. రాష్ట్ర వ్యాప్త సమ్మె సందర్భంగా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలకు జిఒలు జారీచేసి అమలు చేయాలన్నారు. సమావేశంలో వై. చిన్నారావు, శ్రీను, శివంగి, భవాని పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

జనసేన ఆత్మీయ సమావేశంలో నాగబాబు

నిరసన వ్యక్తం చేస్తున్న జనసేన వార్డు అధ్యక్షులు

ప్రజాశక్తి- పెందుర్తి : రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా జనసేన శ్రేణులు పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగేంద్రబాబు పిలుపునిచ్చారు. గురువారం జివిఎంసి 97వ వార్డులో ప్రైవేటు కల్యాణ మండపంలో జనసేన ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతూ, పార్టీలో అంతర్గతంగా ఏవైనా సమస్యలుంటే వాటిని సర్దుబాటు చేస్తామని, అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. పొత్తులకు లోబడి సీట్లు కేటాయింపు ఉంటుందని, దాన్ని ప్రతిఒక్కరూ శిరసావహించాలని సూచించారు.

పంచకర్ల సీటిస్తే సహకరించం

పదేళ్లుగా పార్టీలో పనిచేసే వారికి కనీస ప్రాధాన్యత లేకుండా వ్యవహరిస్తున్నారని, ఆత్మీయ సమావేశానికి తమకు ఆహ్వానాలే లేవని జనసేన 94వ వార్డు అధ్యక్షురాలు పిన్నింటి పార్వతి ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ వాడ నుంచి ర్యాలీ నిర్వహిస్తూ, తమకు సమాచారమైనా ఇవ్వకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఎప్పటినుంచో శివశంకర్ నాయకత్వంలో పనిచేస్తూ వస్తున్నామని, ఇపుడు ఆయనతోపాటు తమనూ పక్కన పెట్టేశారని, కొత్తగా వచ్చేవారికి అందలం ఎక్కించడం దుర్మార్గమన్నారు. పంచకర్లకు సీటిస్తే సహకరించేది లేదంటూ సమావేశంలోనే పెద్దఎత్తున నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.

కేన్సర్ చికిత్సకు కార్-టి సెల్ థెరపీ

రాష్ట్రంలో మొదటిసారిగా ఆరిలోవ అపోలో ఆసుపత్రిలో ప్రారంభం

వివరాలు వెల్లడిస్తున్న అపోలో ఆంకాలజిస్టులు

ప్రజాశక్తి - ఆరిలోవ : లుకేమియా, లింపోమా వంటి కొన్ని రకాల రక్త కేన్సర్లను పారదోలడానికి అధునాతన చిమెరిక్ యాంటిజెన్ రిసెప్టర్ (సిఎఆర్)-టి సెల్ అందుబాటులోకి వచ్చిందని ఆరిలోవ అపోలో ఆసుపత్రి ఆంకాలజీ విభాగం వైద్యనిపుణులు వెల్లడించారు రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా ఈ వైద్యవిధానంలో ఒక లుకేమియా రోగికి వైద్యం చేశామని వెల్లడించారు. గురువారం అపోలో ఆసుపత్రిలో మీడియాతో అంకాలజిస్టులు డాక్టర్ బోయ రాకేష్‌రెడ్డి, సిఇఒ రామచంద్ర, డాక్టర్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ, ఇప్పటివరకు కేన్సర్ వ్యాధి నివారణకు ఆపరేషన్, కిమోథెరపీ, రేడియేషన్ వంటి వైద్యవిధానాలను అవలంభించే వాళ్లమన్నారు. ఇపుడు కేన్సర్ రోగులకు వరంలా కార్-టి సెల్ థెరపీ అందుబాటులోకి వచ్చిందన్నారు. రాష్ట్రంలోనే మొదటిసారిగా ఈ వైద్య విధానం ద్వారా ఆరిలోవ అపోలో ఆసుపత్రిలో లుకేమియా రోగికి వైద్యం చేసామని వెల్లడించారు. శరీరంలో రక్తంలోని టి-సెల్స్‌ను సేకరించి, ప్రయోగశాలలో మెడికల్ ఇంజినీరింగ్ నైపుణ్యంతో కేన్సర్‌ను సమర్ధవంతంగా ఎదుర్కొనే కణాలుగా వాటిని అభివృద్ధి చేసి, తిరిగి మనిషి శరీరంలోకి వాటిని ప్రవేశపెడతారు. వీటికున్న స్వీయరక్షణ సామర్ధ్యంతో శరీరంలోని కేన్సర్ కారక కణాలను నశింపజేయడంతో పాటు, కొత్త కణాల రాకుండా అడ్డుకోవడంతో ప్రముఖ పాత్ర పోషిస్తాయన్నారు. కార్-టి సెల్ థెరపీ కొన్ని రకాల కేన్సర్ రోగులకు వరం కానుందని వెల్లడించారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

ఫ్రెషర్స్‌డే వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ప్రజాశక్తి- తగరపువలస : విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని భీమిలి ఎమ్మెల్యే, అవంతి విద్యా సంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ఫార్మసీ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఫార్మసీ రంగంలో అపారమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. ఎయు ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వై రాజేంద్ర పసాద్, సోలార ఫార్మా సైన్సెస్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పి సాయి దుర్గాప్రసాద్, ఎయు సిఐపిఎస్ విశ్రాంత ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.సత్య నారాయణ పాల్గొన్నారు

మెరుగైన ఫలితాల సాధనే లక్ష్యం : డిఇఒ

ప్రజాశక్తి -మధురవాడ : పదవ తరగతిలో మెరుగైన ఫలితాల సాధనే లక్ష్యంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు సమిష్టిగా కృషి చేయాలని డిఇఒ చంద్రకళ అన్నారు. గురువారం జివిఎంసి ఏడో వార్డు సునీల్ శర్మ (వాంబే) కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదిలో విద్యాబోధనపై పరిశీలన జరిపారు. ప్రణాళికాబద్ధంగా విద్యార్థులను పది పరీక్షలకు సన్నద్ధం చేయాలని సూచించారు. 9వ తరగతి విద్యార్థులకు ప్రయోగశాల వినియోగం పెంచాలన్నారు. 5వ తరగతి విద్యార్థులకు చదవడం, రాయడం ప్రక్రియలను పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్‌ఎం కురమాన గీతాదేవి పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ చంద్రకళ

గిట్టుబాటు ధరకై గిరిజన జీడి రైతుల ధర్నా

ఈ క్రాప్ నమోదు, రుణాలు మంజూరు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి-దేవరాపల్లి

జీడీ పంటకు గిట్టుబాటు ధర ప్రకటించి, ప్రభుత్వమే రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని, జీడీ తోటలకు ఈ- క్రాప్ నమోదు, రుణాలు మంజూరు చేయాలని కోరుతూ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, గిరిజన సంఘం ఆధ్వర్యాన వందలాది మంది గిరిజన రైతులు గురువారం దేవరాపల్లి తహశీల్దార్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేశారు. అనంతరం తహశీల్దార్‌కు, వ్యవసాయశాఖాధికారికి వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బిటి.దొర, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న మాట్లాడుతూ జీడీ పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో వ్యాపారులు తమకు ఇష్టం వచ్చిన ధరకు కొనుగోలు చేస్తూ రైతులను నిలువ దోపిడీ చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం జీడీ పిక్కలు 80 కేజీల బస్తాను వ్యాపారులు రూ.7వేలుకు కొనుగోలు చేస్తున్నారని, ఒక బస్తా జీడిపిక్కల నుండి 25 కేజీల పప్పు వస్తుందని, కేజీ పప్పు ధర రూ.800 అంటే ఒక బస్తా పిక్కలు వల్ల రూ.20 వేలు వస్తుందని చెప్పారు. ఒక బస్తా పిక్కలు ప్రాసెసింగ్‌కు రూ.2వేలు ఖర్చు

తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గిరిజన జీడి రైతులు

అవుతుందన్నారు. రైతులు కోరిన విధంగా బస్తా జీడిపిక్కలకు రూ.16వేలు ధర ప్రకటించినా వ్యాపారులకు రూ.2వేలు మిగులుతుందని, దీంతో పాటు జీడి తొక్క, నూక ఇతర ఉప ఉత్పత్తుల నుంచి కూడా వ్యాపారులకు ఆదాయం వస్తుందని చెప్పారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించకపోవడం వల్ల ఇటు రైతులు, అటు వినియోగదారులు నష్టపోతున్నారన్నారు. కాబట్టి ప్రభుత్వమే జీడి పంటకు గిట్టుబాటు ధర నిర్ణయించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. జీడి పంటను, పరిశ్రమను అభివృద్ధి చేసి రైతులు, కార్మికులకు ఉపాధి కల్పించవలసిన కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థల ప్రయోజనం కోసం రైతులను బలి చేస్తుందని విమర్శించారు. కేరళ రాష్ట్రం మాదిరిగా జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జీడి రైతులు కె.అప్పన్న, డి.శంకర్, నాగరాజు, దొరబాబు, జె.పోతురాజు, జగన్నాథం, సిహెచ్.దేముడు, నాగేశ్వరరావు, చిన నారాయణ, కె.సన్యాసి, కె.ఈశ్వరరావు, జె.ఈశ్వరరావు, లక్ష్మణరావు, శ్రీను, అధిక సంఖ్యలో గిరిజన రైతులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న సివిల్ జడ్జి శేషమ్మ

సబ్ జైలును పరిశీలించిన సివిల్ జడ్జి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి సబ్ జైలును సీనియర్ సివిల్ జడ్జి, డిఎల్ఎస్ఎ సెక్రటరీ ఎంవి.శేషమ్మ గురువారం పరిశీలించారు. ఫ్యాన్ ఇండియా క్యాంపెయిన్ ఫర్ ఐడెంటిఫైడ్ జువెనెల్స్ ఇన్ ప్రిజన్ కార్యక్రమంలో భాగంగా జైలును సందర్శించారు. జైల్లో ఉన్న బాల నేరస్తులతో మాట్లాడారు. వారికి సంబంధించిన నేరం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. నేరం చేస్తే వచ్చే సమస్యలు, చట్టాలపై అవగాహన కల్పించారు. నేరస్తులకు జైల్లో అందిస్తున్న ఆహార వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు ప్యానెల్ అడ్వకేట్లతో వీటిపై పరిశీలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జైల్ సూపరింటెండెంట్ గణేష్ రెడ్డి, న్యాయవాదులు కె.సాయిరాం, తులసి, ఎంఎల్ఎస్‌సి ప్రతినిధి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

ప్రజాశక్తి -అనకాపల్లి : యోగ సాధన వల్ల ఆరోగ్యంగా ఉంటామని విశాఖ జిల్లా మహిళ పతాంజలి యోగ అధ్యక్షురాలు యోగానిపుణులు ప్రభ సాహెూ అన్నారు. స్థానిక జార్జ్ క్లబ్ లో గురువారం భారత స్వాభిమాన ట్రస్ట్ నిర్వహణలో గత కొంతకాలంగా నిర్వహిస్తున్న పతాంజలి యోగ సమితి, భారత స్వాభిమాన ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు యోగ గురువులు భీశెట్టి దొరమనాయుడు ఆధ్వర్యంలో చేపట్టిన యోగ శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభ సాహూ హాజరయ్యారు. నాలుగు రోజులు జరుగు తరగతులు అందరూ ఆరోగ్యం వైపు వెళ్లేందుకు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనేక అనారోగ్య సమస్యలకు (మానసిక ఒత్తిడి, గ్యాస్ట్రిక్, షుగర్, బిపి, ఊబకాయ, థైరాయిడ్, వెన్నుపూస, కీళ్ల నొప్పులకు) వంటి దీర్ఘకాల సమస్యలకు ఏకైక సంజీవిని యోగా మాత్రమేనని చెప్పారు. ప్రతి కుటుంబంలో చక్కటి ఆహారపు అలవాట్లు, యోగ సాధనకి పిల్లలతో సహా అందరూ అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాండ్రేగుల చిన్న , కొణతాల పెద్ద, కొలపర్తి కన్నబాబు, భీమరశెట్టి శ్రీనివాసరావు, మల్ల నరసింగరావు, బిఎస్ఎంకె జోగి నాయుడు, ఆడారి చిన్న వీరు నాయుడు, కొణతాల శివాజీ, ఎ.రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని బంగారమ్మ పాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో 7, 8 చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన ట్యాబులను ఎంపీటీసీ రాపేటి అరుణ, సర్పంచ్ దాడి లావణ్య చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బైజుస్ ట్యాబులు వినియోగంపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు. విద్యార్థులు ఆధునిక నైపుణ్యతను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాపేటి రాము, దాడి కన్నం నాయుడు, దొడ్డి కన్నం నాయుడు, అప్పలరాజు, కిల్లి సత్యనారాయణ, పాఠశాల చైర్మన్ శ్రావణి, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చూడముచ్చటగా జనుము పంట

ప్రజాశక్తి -కశింకోట : మండలంలోని బయ్యవరం గ్రామంలో జనుము పంట చూడముచ్చటగా ఉంది. రైతులు వరి పంట కోత కోసిన తరువాత జనుము పంట వేశారు. ఇది తక్కువ సమయంలోనే ఏపుగా పెరిగి పూతదశకు వచ్చింది. బయ్యవరం తేగాడ రోడ్ పక్కన పంట పొలాల్లో పచ్చని పంట, పసుపు పచ్చని పూతతో చూపరులను విశేషంగా ఆకర్షిస్తుంది. దీంతో ఆ దారిలో రాకపోకలు సాగించేవారు జనుము పంటతో సెల్ఫీలు తీసుకుంటున్నారు.

ఏపుగా పెరిగిన జనుము చేను

టేబుల్ టెన్నిస్ బోర్డు అందించిన దృశ్యం

పాఠశాలకు టేబుల్ టెన్నిస్ బోర్డు వితరణ

ప్రజాశక్తి- కశింకోట : కశింకోట డిపిఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు నరసింగబిల్లి ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జిటిగా పనిచేస్తున్న బి.సురేషకుమార్ తన తండ్రి జ్ఞాపకార్థం టేబుల్ టెన్నిస్ బోర్డును సమకూర్చారు. దీనిని ఆయన గురువారం పాఠశాల హెచ్ఎం ఎంఆర్‌వి.అప్పారావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ టేబుల్ టెన్నిస్ బోర్డును సద్వినియోగం చేసుకుని జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆచంట రవి, ఎన్‌జెవి.ప్రసాద్, పివిఆర్.ప్రభాకర్, పిడి ప్రభాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు రూ.2లక్షలు రుణమాఫీ చేయాలని ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ రైతులకు ఒకే దఫా రూ.2 లక్షలు వరకు రుణమాఫీ చేయాలని రైతు సంఘం ఆధ్వర్యాన స్థానిక ఆర్డిఓ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ గిట్టుబాటు ధర లేక రైతులు నష్టాలు ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు సబ్సిడీ మీద ఇవ్వాలని ఎన్నో మార్లు ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర బడ్జెట్లో రైతులకు ఎటువంటి ఉపశమనం కలిగించే చర్యలు చేపట్టలేదన్నారు. కౌలు రైతులు పెట్టుబడి పెట్టి వ్యవసాయం చేస్తుంటే కనీసం పెట్టుబడి డబ్బులు కూడా రాక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. జిల్లాలో మూతపడిన సుగర్ ఫ్యాక్టరీలను తెరిచి చెరుకు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వేచలపు కాసుబాబు, రెడ్డి అప్పలనాయుడు, గొర్లి దేవుడు, కోరుబిల్లి శంకర్రావు, సత్యనారాయణ, పాల్గొన్నారు.

మహిళా పోలీసులతో సమీక్షా సమావేశం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని గ్రామ సచివాలయాల మహిళా పోలీసులతో స్థానిక సీఐ పిన్నింటి రమణ గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా పోలీసులకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించి పలు సూచనలు అందించారు. గ్రామాల్లో మహిళలపై హింస, అసాంఘిక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో జరిగిన సంఘటనపై తమకు మహిళా పోలీసులు ఎప్పటికప్పుడు సమాచారం అందజేయాలని సూచించారు.

ట్రాఫిక్ నియంత్రణ టెక్నాలజీ వాడాలి

జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి

సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్‌పి తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఆధునిక సాంకేతికత ఎక్కువగా ఉపయోగిస్తూ వాహనాల రద్దీ నియంత్రించాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన రహదారి భద్రతా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా మీదుగా వెళ్తున్న జాతీయ రహదారిలో ఎక్కువ ప్రమాదాలకు ఆస్కారం ఉన్న బ్లాక్ స్పాట్స్ వద్ద తగిన ముందస్తు భద్రతా చర్యలను చేపట్టాలని సూచించారు. అనకాపల్లి అచ్యుతాపురం రహదారి అభివృద్ధి వేగంగా చేపట్టాలని, అచ్యుతాపురం- రాంబిల్లి, అచ్చుతాపురం- ఎలమంచిలి రోడ్లను మరింత అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ఆనందపురం- అనకాపల్లి, అనకాపల్లి- రాజమండ్రి జాతీయ రహదారుల్లో కొక్కిరాపల్లి, రేగుపాలెం, లంకెలపాలెం, పులపర్తి, పురుషోత్తపురం, ఉమ్మలాడ, నరసింగపల్లి ప్రాంతాలలో సిగ్నల్స్ లైటింగ్ మరింత మెరుగు పరచాలన్నారు. ప్రతి కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా ఎస్‌పి మురళీకృష్ణ మాట్లాడుతూ పోలీసు, రవాణా శాఖ సమన్వయంతో ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి తగిన చర్యలు చేపట్టాలన్నారు. అంతకుముందు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాలు, పరిరక్షణకు సంబంధించి వివరాలను జిల్లా రవాణా అధికారి ప్రకాష్‌రావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి విజయ భాస్కర్, డిఎంహెచ్వో డాక్టర్ ఎ హేమంత్, డిఆర్‌డిఎ పిడి శచీదేవి, జిల్లా పరిశ్రమల అధికారి జిఎం శ్రీధర్, అనకాపల్లి పరవాడ డీఎస్పీలు సుబ్బరాజు, సత్యనారాయణ, డిపిటిఓ కే.పద్మావతి, ఆర్ అండ్ బి ఈఈ రమేష్, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు, ఎంవి ఇన్స్పెక్టర్లు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

శాంతి సదస్సును అడ్డుకోవడం సరికాదు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : అహ్మదియ్య ముస్లిం కమ్యూనిటీని ముస్లిమేతరులుగా ప్రకటించేందుకు ప్రయత్నించడం భారత రాజ్యాంగానికి విరుద్ధమని సంస్థ జాతీయ ప్రతినిధి కె.తారీఖ్ అహ్మద్ అన్నారు. విశాఖ నగరంలో అహ్మదియ్య ముస్లిం కమ్యూనిటీ ప్రపంచ శాంతిపై గత నెల 28న గ్రీన్ పార్క్ హోటల్లో నిర్వహించాల్సి ఉందన్నారు. కానీ కొన్ని ముస్లిం సంస్థలు ఈ సదస్సును అడ్డుకోవాలని పిలుపునిచ్చాయని తెలిపారు. ఈ ప్రయత్నాన్ని అహ్మదియ్య ముస్లిం సంఘం తీవ్రంగా ఖండిస్తూ, తమకు న్యాయం జరిగేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్టు మీడియాకి విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు విశాఖపట్నం శాఖ అహ్మదియ్య ముస్లిం కమ్యూనిటీని ముస్లిమేతరులుగా ప్రకటించే ప్రయత్నాన్ని బలపర్చడం రాజ్యాంగ ఉల్లంఘన చర్యగా అభివర్ణించారు. దేశంలోని అనేక హైకోర్టులు అహ్మదియ్య ముస్లిం కమ్యూనిటీ ఒక ఇస్లామిక్ సంస్థ అని తీర్పులనిచ్చాయనే విషయాన్ని గుర్తుచేశారు.

సంకల్ప సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : అంబేద్కర్ ఇండియా మిషన్ ఆధ్వర్యంలో ఈనెల 10న పాయకరావుపేటలో నిర్వహిస్తున్న దళితవాడ పంచాయతీ సాధన సంకల్ప సభను విజయవంతం చేయాలని మండల అంబేద్కర్ ఇండియా మిషన్ కమిటీ సభ్యులు కోరారు. ఈ సభపై మండలంలోని దేవరాపల్లి, వెంకటరాజపురం, తెనుగుపూడి, గరిసింగి తదితర గ్రామాలలో గురువారం విస్తృత ప్రచారం చేశారు . ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షులు దువ్వాడ రమేశ్ మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయం అంబేద్కర్ ఇండియన్ మిషన్‌తోనే సాధ్యమన్నారు. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు పాయకరావుపేట హైస్కూల్ గ్రౌండ్‌లో జరుగు సభకు అంబేద్కర్ వాదులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మున్సిపాలిటీ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలి

-వామపక్షాల ఆధ్వర్యాన ర్యాలీ -లోకాయుక్తకు తప్పుడు సమాచారం ఇచ్చిన జివిఎంసి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి గాంధీనగర్‌లోని సర్వే నెంబర్ 348లో ఉన్న మున్సిపాలిటీ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరుతూ సిపిఎం, సిపిఐ, సిపిఐఎంఎల్ లిబరేషన్, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన గురువారం స్థానిక శ్రామిక సదన్ నుండి జీవీఎంసీ జోనల్ కమిషన్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జివిఎంసి అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, సిపిఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, కాంగ్రెస్ నాయకులు డి.సంతోష్ మాట్లాడుతూ గాంధీ నగరం, మిర్యాల కాలనీలో సర్వేనెంబర్ 348లో అనకాపల్లి మున్సిపాలిటీ సిబ్బంది కోసం ఎల్‌ఐజి పథకం కింద నిర్మించిన క్వార్టర్స్‌లో నెంబర్ 1లో ఉన్న మాజీ ఉద్యోగి కుటుంబ సభ్యులు తమకు 532 చదరపు గజాల స్థలం ఉన్నట్టుగా రిజిస్ట్రేషన్ చేశారని తెలిపారు. దీనిని కొంతమంది వ్యక్తులు కొనుగోలు చేసి జీవీఎంసీ నుండి అనుమతి తీసుకొని భవన నిర్మాణాన్ని ప్రారంభించారని పేర్కొన్నారు. ఈ భూ కుంభకోణంపై 2023 జూన్ నెలలో జీవీఎంసీ కమిషనర్‌కు తాము ఫిర్యాదు చేసినా నేటి వరకు విచారణ జరపలేదని, నోటీసు కూడా ఇవ్వలేదని తెలిపారు. దీనిపై లోకాయుక్త ముందు కేసు దాఖలు చేశామన్నారు. దీనిపై జీవీఎంసీ కమిషనర్ అఫిడవిట్ దాఖలు చేశారని, మున్సిపాలిటీ స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులు మూడో పార్టీకి విక్రయించినట్లు అంగీకరిస్తూ భవన నిర్మాణానికి ఇచ్చిన అనుమతిని మాత్రం రద్దు చేయలేదని పేర్కొన్నారు. అక్కడ పనులు జరగటం లేదని లోకాయుక్త ముందు జీవీఎంసీ కమిషనర్ అంగీకరించాలని, అయితే సర్వే నెంబరు 348లో పనులు నిరంతరంగా జరుగుతూనే ఉన్నాయని తెలిపారు. స్థానిక మంత్రి గుడివాడ అమర్నాథ్ ముఖ్య అనుచరుడు కావడంతో దీనిపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. దీనిపై జివిఎంసి కమిషనర్ బహిరంగ విచారణ, అక్కడ జరిగిన పనులపై విజిలెన్స్ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకొని జిల్లా పౌర గ్రంథాలయాన్ని నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు వైఎన్. భద్రం, బొడ్డేడ అప్పారావు, నూక అప్పారావు, రెడ్డిపల్లి అప్పలరాజు, వియ్యపు రాజు, తేలయ్యబాబు, గొర్లి దేవుడుబాబు, ఎస్.గజాలు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న వామపక్ష నాయకులు

ఆరోపణలు సరికాదు

ప్రజా ప్రయోజనాల కోసం ప్రజల పక్షాన పోరాడాల్సిన ప్రజాసంఘాల ముసుగులో కొందరు నాయకులు తప్పుడు ఫిర్యాదులతో బ్లాక్ మెయిలింగ్ పాల్పడుతున్నారని వైయస్సార్‌సిపి నాయకుడు పలక రవి ఆరోపించారు. అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలంటూ ప్రజా సంఘాలు నాయకులు ర్యాలీ చేస్తుండగా, పలక రవి కుటుంబ సభ్యులు కూడా తమకు న్యాయం చేయాలంటూ వారి ర్యాలీ ముందు నడిచారు. ప్రజాసంఘాల నాయకుల నినాదాలకు ప్రతిగా వైసిపి నాయకులు పలక రవి భార్య ఏఎంసి చైర్మన్ పలక యశోద ప్రతి నినాదాలు చేశారు. తనపై ఆరోపణలు చేయడం సరికాదని వారు పేర్కొన్నారు.

అంకెల గారడీ బడ్జెట్

ప్రజాశక్తి - అనకాపల్లి, బుచ్చయ్యపేట, పరవాడ, చీడికాడ

రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అంచనాలు కొండంత.. ఖర్చులు పిసరంత ఉన్నాయని, బడ్జెట్ అంతా అంకెల గారడీలా ఉందని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగజగదీశ్వరరావు, అనకాపల్లి, చోడవరం నియోజకవర్గాల ఇన్‌చార్జులు పీలా గోవింద సత్యనారాయణ, బత్తుల తాతయ్యబాబు, మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పరవాడ మండల అధ్యక్షులు వియ్యపు చిన్న ఆరోపించారు. ఈ మేరకు గురువారం అనకాపల్లిలో నాగజగదీష్, పీలా, బుచ్చయ్యపేటలో బత్తుల, చీడికాడ మండలంలో గవిరెడ్డి, పరవాడలో వియ్యపు విలేకర్లతో మాట్లాడారు. రూ.13వేల కోట్ల రెవెన్యూ లోటును రూ.44వేల కోట్లకు, రూ.35వేల కోట్ల ద్రవ్యలోటును రూ.60 వేల కోట్లకు పెంచిన ఘనత బుగ్గనదేనని పేర్కొన్నారు. పన్నుల బాదుడు తప్ప బడ్జెట్‌లో కొత్త అంశాలు ఏమీ లేవన్నారు. ఆంధ్రప్రదేశ్ అప్పులు 11.58 లక్షల కోట్లకు చేరుకుందని ఆందోళన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో ఆరోగ్యశ్రీకి నిధులు అరకొరగా కేటాయించారన్నారు. రాష్ట్రాన్ని దివాలా తీయించిన ఘనత వైసిపి సర్కారుకే దక్కుతుందన్నారు. ధరల పెంపు, పన్నుల భారం, రిజిస్ట్రేషన్ ఛార్జీలు భారీగా పెంచిన జగన్, విద్యుత్ ఛార్జీల వడ్డనలో ఎక్కడా రాజీపడలేదని పేర్కొన్నారు. ఆయా విలేకర్ల సమావేశాల్లో అనకాపల్లి టిడిపి నాయకులు లాలం కాశీనాయుడు, కర్రి బాబి, బుచ్చయ్యపేట నాయకులు గోకివాడ కోటేశ్వరరావు, శిరిగిరిశెట్టి శ్రీరామ్మూర్తి, దొంకిన అప్పలనాయుడు, వియ్యపు అప్పారావు, సాయం శేషు, ముచ్చకర్ల తాతీలు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ఏజెన్సీకి పర్మినెంట్ డీలర్లను నియమించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో సుమారు 17 సంవత్సరాలుగా ఇండియన్ ఎల్పిజి గ్యాస్ ఏజెన్సీకి పర్మినెంట్ డీలర్‌ను నియమించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. 17 ఏళ్లగా పర్మినెంట్ డీలర్ లేకుండా ఇన్చార్జిలకు అప్పగించగా వారు బినామీలతో నడిపించడం దుర్మార్గమన్నారు. పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో సిపిఐ అనకాపల్లి జోనల్ కార్యదర్శి వైఎన్ .భద్రం, తాకాసి వెంకటేశ్వరరావు, కోరుబిల్లి శంకర్రావు, శ్రీరామదాసు అబ్బులు మాట్లాడారు. సుమారు 20 వేల పైగా వినియోగదారులు కలిగిన ఇండియన్ వంటగ్యాస్ ఏజెన్సీకి 2007 నుండి పర్మినెంట్ డీలర్ లేరన్నారు. అప్పటినుండి ముగ్గురు,నలుగురు ఇన్చార్జ్ డీలర్ల కు బాధ్యత అప్పగించగా వారు నిర్వహించకుండా, బినామీచేత నడిపించడం వల్ల వినియోగదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ఇప్పుడు బినామీగా వ్యవహరిస్తున్న వ్యక్తి తన అంగ బలం, అర్ధ బలం, రాజకీయ పలుకుబడిని ఉపయోగించి అధికారులను తన ప్రలోభాలతో లొంగదీసుకుని తానే చక్రం తిప్పుతున్నాడని ఆరోపించారు. ఇందులో ఇండియన్ ఆయిల్ కంపెనీ (ఐఓసీ)అధికారులు పాత్రను కూడా తీవ్రంగా అనుమానించవలసి వస్తుందని పేర్కొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన

ప్రజాశక్తి- సబ్బవరం : రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా మండల కేంద్రం సబ్బవరంలో ఆటో డ్రైవర్లు, సరుకు వాహన డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి.రాజన్న, ఇన్‌స్పెక్టర్ శివరామ గోపాల్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనం నడుపుతున్నప్పుడు సీటు బెల్టు ధరించాలని సూచించారు. సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనం నడపరాదన్నారు. నియమ నిబంధనల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది,పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న అధికారులు

అధిక లోడ్‌తో వెళ్తున్న

వాహనాలను నిలుపుదల చేయాలని వినతి

ప్రజాశక్తి- మునగపాక

అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు మార్గంలో పరిమితికి మించి అధిక లోడ్‌తో వెళ్తున్న భారీ వాహనాలను నిలుపుదల చేయాలని స్థానిక ఎస్సై ప్రసాదరావుకు రోడ్డు పునర్నిర్మాణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ కన్వీనర్ కాండ్రేగుల రామ సదాశివరావు మాట్లాడుతూ అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లోని కంపెనీలకు సమీప క్వారీల నుండి కొండ రాళ్లను అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు మార్గం ద్వారా 40 నుండి 70 టన్నులు అధిక లోడుతో భారీ వాహనాల్లో తీసుకువెళ్లడం జరుగుతుందని చెప్పారు. దీని మూలంగా రోడ్డు మార్గం పూర్తిగా ధ్వంసమైందన్నారు. ఈ భారీ వాహనాలు నిలుపుదల చేయాలని గతంలో పోలీసు ఉన్నతాధికారులకు, ఆర్ అండ్ బి అధికారులకు, జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేశామని, స్పందించిన ఆర్ అండ్ బి అధికారులు అనకాపల్లి బైపాస్ రోడ్డు జంక్షన్లో భారీ వాహనాలు ప్రయాణించరాదని హెచ్చరిక బోర్డులు పెట్టి ఉన్నారని తెలిపారు. అయినా దానిని బేఖాతర చేస్తూ భారీ వాహనాలు యథావిధిగా తిరుగుతున్నాయన్నారు. గుంతలు పడిన మార్గంలో తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా పరిమితికి మించి భారీ నుండి అతి భారీ వాహనాలు ప్రయాణించడం మూలంగా రోజుల వ్యవధిలోనే గుంతలు యథాస్థితి చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. తక్షణమే భారీ వాహనాలు నిలుపుదల చేసి ప్రయాణికులకు భద్రత కల్పించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో రోడ్డు పునర్నిర్మాణ కమిటీ సభ్యులు ఆళ్ళ మహేశ్వరరావు, ఎస్ బ్రహ్మాజీ, మొల్లేటి సత్యనారాయణ, పెంటకోట ఆదినారాయణ నాయుడు, మల్ల రామ జగన్నాథం ఉన్నారు.

వినతిపత్రం ఇస్తున్న రహదారి పునర్నిర్మాణ పోరాట కమిటీ నేతలు

బిజెపి ముందు మోకరిల్లుతున్న

వైసిపి, టిడిపి, జనసేన

ప్రజాశక్తి-చోడవరం

రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి జనసేన పార్టీలు ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టి బిజెపి ముందు మోకరిల్లుతున్నాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గూనూరు వెంకట్రావు విమర్శించారు. చోడవరంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో బిజెపికి ఒక శాతం ఓట్లు కూడా లేకపోయినా ఆ మూడు పార్టీల నాయకులు తమ అవినీతి కార్యకలాపాలను కప్పిపుచ్చుకోవడానికి మోడీకి భజన చేస్తున్నారని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముతుంటే ఈ పార్టీలు నోరు మెదపకపోవడం సిగ్గుచేటన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తప్ప ఆంధ్రప్రదేశ్‌కు మంచి రోజులు రావన్నారు. చోడవరం నియోజకవర్గంలో రోడ్లు అధ్వానంగా ఉండడంతో ఎంతోమంది ప్రమాదాలకు గురై ఆస్పత్రి పాలవుతున్నారని పేర్కొన్నారు. ఈనెల 10వ తేదీన నర్సీపట్నం మండలంలో వైయస్ షర్మిల పర్యటనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రావికమతం మండల అధ్యక్షుడు జంపాల నాగేశ్వరరావు, షేక్ మేర, సయ్యపురెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జనసేన, టిడిపి కూటమితో 95 శాతం విజయం

నాగబాబు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో జనసేన -టిడిపి ఎలయన్స్ 95 శాతం స్థానాల్లో విజయం సాధిస్తుందని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు అన్నారు. జివిఎంసి 39వ వార్డు కార్పొరేటర్ మహమ్మద్ సాధిక్ ఆధ్వర్యాన దక్షిణ నియోజకవర్గంలో జనసేన కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ, తమ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఎక్కడ నుంచి పోటీ చేయమని నిర్ణయిస్తే అక్కడ నుంచి తాను పోటీ చేస్తానన్నారు. సిఎం జగన్ ఢిల్లీ పర్యటనలు సొంత ఎజెండాతోనే సాగుతున్నాయన్నారు. జనసేన, టిడిపిలతో బిజెపి పొత్తు కుదురుతుందని ఆశిస్తున్నానని చెప్పారు. రాష్ట్రంలో అరాచక, అవినీతికరమైన వైసిపి ప్రభుత్వాన్ని దించడమే తమ ఎజెండా అన్నారు.

జనసేన క్రియాశీల కార్యకర్తల సమావేశం

రాంబిల్లి : జనసేన పార్టీ మండలంలోని క్రియాశీలక కార్యకర్తల సమావేశం గురువారం మండల కేంద్రంలో జరిగింది. పార్టీ అధికార ప్రతినిధి, యలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జి సుందరపు విజయకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగేంద్రబాబు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ సమావేశంలో జనసేన ఉత్తరాంధ్ర రాజకీయ వ్యవహారాల ప్రతినిధి సుందరపు సతీష్, రూరల్ జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబు, సీనియర్ నాయకులు పైల రామునాయుడు, మాజీ జెడ్పిటిసి జనపరెడ్డి శ్రీనివాసు, సీనియర్ నాయకులు లాలం చందు, మండలాల నాయకులు బయలపూడి రామదాసు, పప్పల నూకన్న దొర, టెక్కలి పరశురాం, అన్నం బాబ్జి, బొద్దపు శ్రీను, లాలం సోమునాయుడు, మోటూరు శ్రీవేరి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న జనసేన నేత నాగబాబు

ప్రజాశక్తి 7
శుక్రవారం 9 ఫిబ్రవరి 2024

ఆశా కార్యకర్తల నిర్బంధంపై నిరసన

విశాఖలో మాట్లాడుతున్న ఆర్‌కెఎస్‌వి కుమార్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : చలో విజయవాడ కార్యక్రమానికి ఆశ వర్కర్లను వెళ్లకుండా నిర్బంధించడాన్ని వ్యతిరేకిస్తూ ఆశ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ ఆధ్వర్యాన గురువారం జగదాంబ జంక్షన్‌లో ఆశా వర్కర్లు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ముందుగా సిఐటియు జిల్లా కార్యాలయం నుంచి జగదాంబ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు విశాఖ జిల్లా కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, ఆశా వర్కర్లను అణిచివేసేందుకు, ధర్నా చేయనివ్వకుండా చూసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించిందన్నారు. చట్టాలను ఉల్లఘించి అర్ధరాత్రి ఆశా వర్కర్లను స్టేషన్‌లో ఉంచిందని, విధి నిర్వహణలో ఉన్నప్పుడు నోటీసులు ఇచ్చి భయభ్రాంతులకు గురిచేసిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వై.రాజు, జి.పోలీశ్వరరావు, ఎం.సూరీడు, ఆశా యూనియన్ నాయకులు పి.మణి, వరలక్ష్మి, భారతి, సునీత, శివ, ఈశ్వరి, కుమారి, నవ్య, సరోజ తదితరులు పాల్గొన్నారు.

నిర్బంధం అమానుషం : జగ్గునాయుడు

విశాఖ కలెక్టరేట్ : ఆశా వర్కర్లపై నిర్భందాన్ని ప్రయోగించడం అమానుషమని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పేర్కొన్నారు. సిఐటియు నాయకులను, ఆశ వర్కర్లను పోలీసులతో అక్రమ అరెస్టులకు పూనుకోవడం, గృహ నిర్బంధించడం దుర్మార్గమని, ఈ చర్యను సిపిఎం తరుపున తీవ్రంగా ఖండించారు. నిర్బంధాలకు పూనుకోవడమంటే ప్రజాస్వామ్య హక్కులపై దాడి చేయడమేనని పేర్కొన్నారు. ఎన్నికల ముందు జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన వాగ్ధానాలను అమలు చేయాలని స్కీం వర్కర్లు చేస్తున్న పోరాటం న్యాయసమ్మతమైనదన్నారు. కార్మిక, ప్రజా పోరాటాలను అణచివేసే చర్యలు మానుకోకపోతే ప్రజాగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు.

న్యూపోర్ట్ పోలీస్‌స్టేషన్ వద్ద ఆశాల నిరసన.

గాజువాక : తమ సమస్యల పరిష్కారానికి చలో విజయవాడ ఆందోళనకు వెళుతున్న ఆశావర్కర్లను పోలీసులు గృహనిర్బంధం, అక్రమ అరెస్టులు చేయడాన్ని నిరసిస్తూ పెదగంట్యాడ ఆశా వర్కర్స్ న్యూ పోర్టు పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోలన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు స్టీల్ జోన్ ప్రధాన కార్యదర్శి కొదిరి అప్పలరాజు మాట్లాడుతూ సంక్రాంతి తర్వాత ఆశ వర్కర్స్ సమస్యలను పరిష్కరిస్తామన్న ప్రభుత్వహామీ అమలు చేయకపోవడంతో దాన్ని గుర్తు చేసేందుకు చలో విజయవాడ ఆందోళనకు వెళు తున్నవారిని అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. నిర్బంధాలు, అరెస్టలతో సమస్యలు పరిష్కారం కావని, సమస్య మరింత జఠిలమౌతుందన్నారు. ఆశాలకు ప్రభుత్వమిచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు.కార్యక్రమంలో పాల వెంకయ్య, హేమలత, సోమేశ్వరి, రేణుకావతి, రేణుక పాల్గొన్నారు.

అచ్యుతాపురం : ఆశా కార్యకర్తలపై ప్రభుత్వ నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ గురువారం అచ్యుతాపురం నాలుగు రోడ్ల జంక్షన్లో సిఐటియు, ఆశా కార్యకర్తలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము మాట్లాడుతూ, చలో విజయవాడ కార్యక్రమం సందర్భంగా నిర్బంధించడం దారుణమన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ కె సోమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : ఆశా నిర్బంధంపై సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బస్సు రైల్లో వెళ్లిన వారిని దించేసి ఆడవాళ్ళు అని కూడా చూడకుండా అర్ధరాత్రి వరకు నిర్బంధించారని, నక్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో కాగిత టోల్గేట్ దగ్గర అరెస్టు చేసిన ఆశా కార్యకర్తలని రాత్రి ఒంటిగంట వరకు తీవ్ర చలి లోనే ఉంచారని తెలిపారు. శాంతియుతంగా నిరసన తెలపడానికి వెళ్తున్న వారిని నిర్బంధించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి నాగ శేషు, సిఐటియూ జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరావు, కోశాధికారి వివి.శ్రీనివాసరావు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి సూర్య కళ, నాయకులు భవాని. నాగమణి వెంకటలక్ష్మి గోవిందమ్మ పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో..

నర్సీపట్నంలో నిరసన తెలుపుతున్న ఆశ కార్యకర్తలు

పరవాడ : ఆశా వర్కర్లను మండలంలో పెదముసిడివాడ, వెన్నెల పాలెం, వివిధ గ్రామాల్లో మహిళా పోలీసులు నిర్బంధించడాన్ని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు.

ఆశా కార్యకర్తల నిర్బంధంపై నిరసన

నర్సీపట్నం టౌన్: ఆశా కార్యకర్తలపై పోలీసు నిర్భంధాన్ని ఖండిస్తున్నామని సిఐటియు కన్వీనర్ టి.ఈశ్వరరావు తెలిపారు. గురువారం విజయవాడలో ఆశాల కార్యకర్తలు చేపట్టనున్న ధర్నాకి నాతవరం, గొలుగుండ, నర్సీపట్నం, మాకవరపాలెం మండలాల నుండి వెళు తున్న ఆశాలను పోలీసులు గృహ నిర్భంధం చేయడాన్ని ఖండిస్తూ నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ, ఆశాల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరిచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఆంధ్ర మత్స్యకార' ఉపాధ్యక్షులుగా శివ

నియామక పత్రం అందుకుంటున్న శివ

ప్రజాశక్తి-పాయకరావుపేట: మండలంలోని కొర్లయపేట గ్రామానికి చెందిన వంకా శివ ఆంధ్ర మత్స్యకార జేఏసీ పాయకరావుపేట మండల ఉపాధ్యాక్షులుగా నియమితులయ్యారు. రాష్ట్ర జనరల్ సెక్రెటరీ పిక్కి కోదండరావు ఆదేశాల మేరకు అనకాపల్లి జిల్లా జనరల్ సెక్రెటరీగా చింతకాయల శ్రీనివాస్, వంకా శివకు నియామక పత్రాన్ని మండల కేంద్రంలో గురువారం అందజేశారు. మత్స్యకారులకు అన్ని రంగాల్లో ప్రాదాన్యత ఇవ్వాలని వారు తెలిపారు. రానున్న ఎన్నికల్లో మత్స్యకారులకు అధిక సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. మండలంలో మత్స్యకారుల సమస్యలపై పోరాటం చేస్తానని వంకా శివ స్పష్టం చేశారు.

ప్యాకేజీ చెల్లించే వరకూ పనులు ప్రారంభించొద్దు

-తేల్చి చెప్పిన నిర్వాసితులు, పలు పార్టీల నేతలు

నినదిస్తున్న పలు పార్టీల నేతలు , నిర్వాసితులు

ప్రజాశక్తి -నక్కపల్లి: వైజాగ్ - చెన్నై ఇండస్ట్రీల్ కారిడార్ కోసం సేకరించిన భూములకు సంబంధించి పూర్తిస్థాయిలో పరిహారం, ప్యాకేజీ చెల్లించే వరకు పనులు ప్రారంభించ వద్దని నిర్వాసితులు ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. మండలంలోని బుచ్చిరాజుపేటలో గురువారం నిర్వాసితుల గ్రామాల నాయకులు సమావేశమయ్యారు.ఈ సమావేశానికి టిడిపి, సిపిఎం, జనసేన నాయకులు హాజరయ్యారు. ముందుగా నిర్వాసితుల సమస్యలపై చర్చించారు. ఈ సమావేశంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ, కారిడార్‌లో భూములు కోల్పోయిన నిర్వాశితులైన రైతులకు, కూలీలకు, దళితులకు, చేతి వృత్తిదారులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పూర్తిస్థాయిలో ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాగు భూములకు, చెట్లు కు ,నివాసాలకు పూర్తి పరిహారం, పునరావాసం కల్పించే వరకు ఏ విధమైన శంఖుస్థాపన లు, నిర్మాణాలు చేపట్టవద్దని తేల్చి చెప్పారు. ఏపిఐఐసి అధికారులు సమస్య పరిష్కారానికి మార్గం చూపకుండా గ్రామాల్లో విభజించి పాలించు పద్దతులలో గొడవలు సృష్టిస్తున్నారని దీనిపై ఏపిఐఐసి రాష్ట్ర కమీషనర్ కు, అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు పిర్యాదులు చేస్తామన్నారు. అధికారులు స్పందించి గ్రామాల వారీగా గ్రామ సభలు నిర్వహించి సమస్యలు తెలుసుకుని పరిష్కారం చేయాలని కోరారు. సమస్యలు పరిష్కారం చేయకుండా పనులు చేపడితే అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, బుచ్చిరాజుపేట సర్పంచ్ కాళ్ళ శ్రీను, అమలాపురం గ్రామ సర్పంచ్ పెదపూడి శంకర్రావు, నాయకులు నరసింగరావు, జీ.తిరుపతిరావు, కొండలరావు, ఆర్.గోవిందరావు, బాబ్జీ, ఎస్.అప్పల రాజు, వి.శివ, పి.సత్తిబాబు, చంద్రరావు, ఎస్. గోవిందరావు పాల్గొన్నారు.

విద్యా బోధన చేస్తున్న ఉపాధ్యాయులు

టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని పెదబోదుగల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు రాత్రి వేళల్లో అదనపు తరగతులు నిర్వహిస్తున్నామని హెచ్‌ఎం సత్యనారాయణ, తెలుగు ఉపాధ్యాయులు ఎన్‌విఎస్ ఆచార్యులు అన్నారు. రానున్న పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలన్న ఉద్దేశంతో ప్రతిరోజు రాత్రి అదనపు తరగతులు నిర్వహించి, సబ్జెక్టులు వారీగా సందేహాలను నివృత్తి చేస్తున్నామన్నారు. ఒత్తిడి లేకుండా విద్యార్థులను చదివిస్తున్నామన్నారు. దాతల సహాయంతో విద్యార్థులకు అల్పాహారం కూడా అందజేస్తు న్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫల్గుణరావు, రమేష్ బాబు, కుమారి, చిన్నారావు, శ్రీదేవి పాల్గొన్నారు.

తీరంలో మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: మండలంలోని మత్స్యకార గ్రామమైన రేవుపోలవరం సముద్ర తీరంలో వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు స్థానిక ఎస్ఐ విభీషణరావు తెలిపారు. గురువారం ఉదయం రేవుపోలవరం గ్రామ తీరంలో మృతదేహం లభ్యమైనట్లు గ్రామస్థులు ఇచ్చిన సమాచారం మేరకు తమ సిబ్బంది పరిశీలించినట్లు తెలిపారు. మృతుడు అనకాపల్లి మండలం ఏఎమ్ఏఎల్ కాలేజీ దరి కొత్తూరు గ్రామం రామాలయం వీధికి చెందిన గైపూరి సత్యన్నారాయణగా గుర్తించినట్లు తెలిపారు. మృతుడి బైక్ తీరంలో పార్క్ చేసి ఉన్నట్లు గుర్తించామన్నారు. మృతుడు స్నానానికి దిగి మృతి చెందాడా, ఆత్మహత్యకు పాల్పడ్డాడా అనే కోణాలలో దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. బంధువులకు సమాచారమిచ్చామని, మృతదేహాన్ని నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టమ్ అనంతరం బంధువులకు అప్పగించనున్నట్లు ఆయన తెలిపారు.

సమాధుల స్థలాన్ని పరిరక్షించాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు చరిత్రలో సాక్ష్యాధారంగా ఉన్న కవర్టు, హైటర్ల సమాధులు ఉన్న స్థలాన్ని నర్సీపట్నం ప్రజలు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు పరిరక్షించి కాపాడుకోవాల్సిన అవసరం ఉందని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ,

ఆనాడు నర్సీపట్నం-చింతపల్లి ఘాట్ రోడ్లో బ్రిటీష్ సేనలకు, అల్లూరి సేనలకు జరిగిన భీకర యుద్ధంలో నేల కూలిన బ్రిటీష్ సేనానులు కవర్టు, హైటర్ల సమాధుల అర ఎకరం వరకు ఉన్న ప్రాంతమన్నారు. ఆ స్థలాన్ని పరిరక్షించాలని పర్యాటక కేంద్రంగా, అల్లూరి విజ్ఞాన కేంద్రంగా అభివృద్ధి చేయాలని ఎన్నోసార్లు అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందన్నారు. త్వరలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి పరిరక్షణకై కమిటీని ఏర్పాటు చేయడం జరుగుతుందని పడాల వీరభద్రరావు తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాలపై అవగాహన

ప్రజాశక్తి-మాకవరపాలెం: ప్రభుత్వ కార్యాలయాల పనితీరుపై విద్యార్థులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సంభందించి పాఠాలు ఉండటంతో మండలంలోని తూటిపాల ప్రాథమికొన్నత పాఠశాల విద్యార్థులు గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎంఈవో మూర్తి, మండలస్థాయి అధికారులు కార్యాలయాల విధులపై తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాద్యాయులు రాము, లోవరాజు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

వాతావరణ మార్పులపై వర్క్ షాప్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : అమెరికన్ కాన్సులేట్ జనరల్, ఒడిశాకు చెందిన వ్యాస్ సంస్థ సంయుక్తంగా ఆంధ్ర యూనివర్సిటీ ప్రాంగణంలోని అమెరికన్ కార్నర్‌లో గురువారం మీడియా రంగ ప్రతినిధులకు, ఆంధ్ర యూనివర్సిటీ జర్నలిజం పీజీ విద్యార్థులకు వాతావరణం మార్పులు- వాటిని ప్రజలకు అందించే తీరుపై వర్క్ షాప్ నిర్వహించారు. రిసోర్స్ పర్సన్‌గా టైమ్స్ అఫ్ ఇండియా స్పెషల్ కరస్పాండెంట్ జిన్నాల ఉమామహేశ్వరరావు హాజరై వాతావరణంలో జరుగుతున్న మార్పులు, అందుకు గల కారణాలను వివరించారు. వాతావరణ మార్పులపై కథనాలను ఎంపిక చేసుకునే విధానం, దానికి డేటా సమకూర్చుకోవడం, ప్రజల్లో అవగాహన కల్పించడం తదితర అంశాలపై ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పాత్రికేయులకు వివరించారు. గ్లోబల్ వార్మింగ్, వాతావరణంలోని మార్పులు నివారించడానికి వివిధ దేశాలు, భారతదేశం, ఆంధ్రప్రదేశ్ ఏ విధంగా కృషి చేస్తున్నాయో తన ప్రసంగంలో తెలిపారు.

మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

లేగ దూడలను పరిశీలిస్తున్న సహాయ సంచాలకులు

దేశీయ లేగ దూడలను వృద్ధి చెందించాలి

ప్రజాశక్తి -కోటవురట్ల: గ్రామీణ ప్రాంతాలలో దేశీయ జాతి లేక దూడలను వృద్ధి చెందించాలని కొడవటిపూడిలో నిర్వహించిన లేక దూడల ప్రదర్శనలో పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ సింహాద్రప్పడు సూచించారు. గ్రామ సర్పంచ్ అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి 60 మేలు జాతి పశు దూడలు పాల్గొన్నాయి. సకాలంలో గర్భకోశ పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రదర్శనలో గెలుపొందిన లేగ దూడలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌డిఏ ఈఓ రామ్మోహన్, డిడిఎఫ్ఎస్ బిఎస్ డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

ప్రజాశక్తి-మాకవరపాలెం: మండల కేంద్రంలో డ్వాక్రా మహిళలకు గురువారం ఓటు హక్కు ప్రముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మురళీ మోహనరావు మాట్లాడుతూ, ఓటు ఎంతో విలువైందన్నారు. ఎవరి ప్రలోభాలకు తలొగ్గకుండా సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిటి శంకర్, వెలుగు ఏపీఎం చినబాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్

షర్మిల సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-నక్కపల్లి: రాష్ట్రంలో నియోజకవర్గాల పర్యటనలో భాగంగా పిసిసి అధ్యక్షురాలు షర్మిల తలపెట్టిన సభను జయప్రదం చేయాలని డిసిసి ప్రధాన కార్యదర్శి గుమ్మల గోవిందరావు, జిల్లా ఉపాధ్యక్షులు మేడేటి శంకర్ కోరారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ, అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నియోజవర్గం ములగపూడి గ్రామంలో శనివారం ఉదయం 10 గంటలకు రచ్చబండ, అక్కడ నుండి అరకు నియోజవర్గం, చింతపల్లి మండలంలో జరిగే బహిరంగ సభల్లో షర్మిల పాల్గొంటారని తెలిపారు. ఈ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసి కార్యదర్శి చింతకాయ సింహాద్రి, పార్టీ మండల శాఖ అధ్యక్షులు ప్రగడ చక్కెరరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి కుటుంబాన్ని ఆదుకుంటాం

-ఎస్‌టి కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ శంకరరావు- సమస్యలపై నాయకుల వినతులు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో జోగంపేట ఎస్సీ వసతి గృహంలో చదువుతూ ప్రమాదవశాత్తు మరణించిన తూబిరి డేవిడ్ రాజు కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎస్టీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ జివి.శంకరరావు తెలిపారు. మండలంలో జోగంపేట ఎస్సీ వసతి గృహంలో ఏడవ తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థి డేవిడ్‌రాజు విద్యుత్ షాక్ గురై మృతి చెందడంతో గురువారం బాధితుడి కుటుంబాన్ని పరామర్శించారు.ముందుగా జోగంపేటలో విద్యార్థి మృతి చెందిన ఎస్సీ వసతి గృహాన్ని ఆయన పరిశీలించారు. ప్రమాదం జరిగిన విధానంపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం వసతి గృహాన్ని పక్కనే ఉన్న మరో భవనంలోనికి మార్పు చేయడం జరిగిందని అధికారులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం విద్యార్థి గ్రామమైన పాత మల్లంపేట శివారు బుడ్డడుపాడు గ్రామంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ, కుమారుడిని కోల్పోయిన డేవిడ్ రాజ్ తల్లిదండ్రులకు ప్రభుత్వం అండదండలు అందిస్తుందన్నారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ, బాధిత కుటుంబానికి మెరుగైన జీవనోపాధిని అందించడానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహకారాన్ని అందించడానికి ప్రభుత్వంతో మాట్లాడి న్యాయం చేస్తామన్నారు. అనంతరం గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. భూములకు పట్టాలు ఇవ్వాలని వేడుకున్నారు. అనంతరం కృష్ణదేవిపేట ఉన్న అల్లూరి గంటందొర సమాధులను ఆయన సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జయరాం, ఎంపిడిఒ రత్నకుమారి, డిప్యూటీ తహశీల్దార్ ఆనందరావు, ఎంపిపి జి.మణికుమారి, వైసిపి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత, మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ పాల్గొన్నారు.

కుటుంబ సభ్యును పరామర్శిస్తున్న శంకరరావు

వినతుల వెల్లువ

హాస్టళ్లలో సదుపాయాలు కల్పించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-గొలుగొండ: ఎస్టీ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డివిజి.శంకరరావుకు వినతిపత్రం అందజేశారు. మండలంలో పర్యటించిన చైర్మన్‌కు ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జి.గీతాకృష్ణ సమస్యలను వివరించారు. నర్సీపట్నం ఎస్టీ కళాశాల హాస్టల్స్‌లు ఐదు ఉన్నాయని, ఇందులో శివపురం బాలికల వసతి గీహం, బయపురెడ్డిపాలెంలో బాలుర వసతి గృహం మినహా శివపురంలోని రెండు బాలికల ఎస్టీ హాస్టళ్లకు, ఎస్టీ బాలుర వసతి గృహాలకు సొంత భవనాలు లేవన్నారు. దీంతో అద్దె భవనాల్లో ఉంటున్న హాస్టల్ విద్యార్థులకు మౌలిక సదుపాయాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. మెనూలో కోతలు లేకుండా చూడాలని కోరారు. హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు, దోమ తెరలు పంపిణీ చేయాలన్నారు. నర్సీపట్నంలో ప్రైవేటు ఒకేషనల్ కళాశాలలో ఏజెన్సీ, మైదాన ప్రాంత గిరిజన విద్యార్థులను ఉచిత విద్య, ఉచిత హాస్టల్ సౌకర్యాల పేరుతో అడ్మిషన్లు తీసుకొని ప్రభుత్వం నుండి నిధులు పొందుతూ అర్హులైన అధ్యాపకులను నియమించకుండా విద్యా బోధన చేయలేదని తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారులు పర్యవేక్షణ చేయలేదన్నారు. ఈ విషయంపై విచారణ జరిపి గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ గౌతమ్, డివిజన్ సభ్యులు భూషణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ: గిరిజన భూములను రక్షణ కల్పించాలని సిపిఐ జిల్లా సమితి సభ్యులు జి.రాధాకృష్ణ కోరారు. గొలుగొండ మండలం పర్యటనకు వచ్చిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావుకు రాధాకృష్ణ, చంద్రయ్యపాలెం గ్రామస్థులు తోట ధారబాబు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ పాత మల్లంపేట పంచాయతీ చంద్రయ్యపాలెం గ్రామంలో షెడ్యూల్ తెగ ఎస్టీ గదభలకు డి పట్టాలు ప్రభుత్వం మంజూరు చేసిందని, తాతల నుండి వ్యవసాయ భూమిని సాగు చేస్తున్నారన్నారు. అక్రమంగా పట్టా పాసు పుస్తకాలు చేసుకొని సాగు చేసుకున్న వారిపై పోలీసులతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు.

భూ సమస్యపై సిపిఎం నాయకులు

గొలుగొండ: పాతమల్లంపేట బుడ్డడపాడు గ్రామంలో గిరిజనలు ఎదుర్కొంటున్న భూ సమస్యను రాష్ట్ర ఎస్టీ చైర్మన్ జివి.శంకరరావు దృష్టికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సాపిరెడ్డి నారాయణమూర్తి, కెవిపిఎస్ జిల్లా ప్రదాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కే.గోవిందరావులు విన్నవించారు.పాతమల్లంపేట బుడ్డడపాడు గ్రామంలో 40 కుటుంబాలు ఎస్టీ కొండదొర ఆదివాసి గిరిజనులు జీవనం సాగిస్తున్నారన్నారు. గత 60 సంవత్సరాల నుండి 102 ఎకరాలు డిపట్టా భూములు సాగు చేసుకుంటున్నారన్నారు. గత 50 సంవత్సరాల నుండి గిరిజన రైతులు సాగులో ఉన్నప్పటికీ రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులకు 102 ఎకరాల డీఫారం భూమిని రెవిన్యూ అధికారులు పట్టాలు ఇచ్చారన్నారు. అనేక సార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినాడి పట్టాలు రద్దు చేయలేదన్నారు. ఎస్టీ కమిషన్ జోక్యం చేసుకొని గిరిజనులు సాగు చేస్తున్న భూములకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన మహిళలు తుబేరి రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు చెపుతున్న సిపిఎం నేత గోవిందరావు

గొలుగొండలో ర్యాలీ

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం రోడ్డు భద్రతపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ ఎస్సై బి.కృష్ణారావు, సర్పంచ్ కసిపల్లి బుజ్జి, వైసిపి మండల అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, వెలుగు అధికారులు రుత్తల శ్రీను, కనకమహాలక్ష్మీ, శ్రీరామరమణమ్మ, హైమా, ఉమా, మండల సమాఖ్య అధ్యక్షురాలు శాంతికుమారి పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

పాయకరావుపేట: జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన పాయకరావుపేట సీఐ అప్పలరాజు మాట్లాడుతూ, డ్రైవర్లు వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ట్రాఫిక్ రూల్స్ తెలిపారు. అతివేగం అనర్థాలకు దారి తీస్తుందని, సేఫ్టీ పద్ధతులు పాటించాలని సూచించారు. సీట్ బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని, పార్కింగ్ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రమేష్, ఐ.ఎం.టి మేనేజర్ కే.సత్యన్నారాయణ, టోల్ మేనేజర్ కృష్ణ, సేఫ్టీ మేనేజర్ అశోక్ కుమార్, ప్రకాష్ విద్యా సంస్థల హెచ్ఆర్ డైరెక్టర్ బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో మాట్లాడుతున్న సిఐ అప్పలరాజు

పర్యావరణహితంగా అభివృద్ధి

-ఈ ఏడాదిలో మూడు ఎఫ్‌జిడిలు ఏర్పాటు
-త్వరలో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు శంకుస్థాపన
-ఎన్‌టిపిసి సింహాద్రి ప్రాజెక్ట్ హెడ్ ఎస్‌కె సిన్హా

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

పర్యావరణహిత ప్లాంట్‌గా అభివృద్ధి చేసే క్రమంలో కాలుష్య స్థాయిలను తగ్గించేందుకు ఈ ఏడాదిలో నాలుగు ఫ్లూ గ్యాస్ డీసల్ఫరైజేషన్ (ఎఫ్‌జిడి) యూనిట్లను ఏర్పాటు చేస్తున్నట్లు పరవాడ ఎన్‌టిపిసి సింహాద్రి ప్రాజెక్ట్ హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా తెలిపారు. ఇప్పటికే నాలుగో యూనిట్‌లో ఒక ఎఫ్‌జిడి ఏర్పాటుచేయగా, మిగిలిన మూడు యూనిట్లలో ఈ ఏడాది అక్టోబర్ నాటికి పూర్తి చేస్తామన్నారు. గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఫ్యుజిటివ్ దుమ్ము ఉద్గారాల్ని నియంత్రణకు యాష్ డైక్‌లలో విండ్ బారియర్స్‌తో పాటు గ్రీన్‌బెల్ట్ అభివృద్ధి చేసినట్లు తెలిపారు. సమీప గ్రామాల్లోకి బూడిద ఎగరకుండా డైక్‌ల చుట్టూ స్ప్రింక్లర్లు, రెయిన్‌గన్‌లు ఏర్పాటు చేశామన్నారు. కాలుష్యానికి సంబంధించి పిట్టవానిపాలెం కేసును నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి) కొట్టివేసిందన్నారు. సిఎస్ఆర్ నిధులతో పరిసర గ్రామాల్లో వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఎన్‌టిపిసి భవనాలపై రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఎన్‌టిపిసిలో ఉపాధి పొందిన తెలుగు రాష్ట్రాలకు చెందిన 95 శాతం కాంట్రాక్ట్ ఉద్యోగుల్లో 75 శాతం స్థానికులేనన్నారు. దేశంలో విద్యుత్ వినియోగం ఎనిమిది నుంచి పది శాతం పెరిగిందన్నారు. వినియోగాన్ని పరిగణనలోకి తీసుకొని యూనిట్ల వాస్తవ సామర్థ్యానికి తగినట్లు విద్యుత్ ఉత్పత్తి జరిగేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన బొగ్గు నిల్వలున్నాయన్నారు. త్వరలో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్ట్ శంకుస్థాపనకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో ప్రభుత్వంతో ఈ ప్రాజెక్టుకు ఎంఒయు చేసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ జనరల్ మేనేజర్ డిపి పాత్రా, ఆపరేషన్స్ జనరల్ మేనేజర్ టిఆర్ రాజగోపాలన్, హెచ్ఆర్ హెడ్ బిబి పాత్రా, టెక్నికల్ సర్వీసెస్ జనరల్ మేనేజర్ పద్మప్రియ, ఎజిఎం డాక్టర్ విజయన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎన్‌టిపిసి సింహాద్రి ప్రాజెక్టు హెడ్ సిన్హా